

- పరిశోధనలు, పరిశ్రమలకు ఏపీలో విస్తృత అవకాశాలు
- భవిష్యత్తు అంతా గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టులదే
- జీరో కాలుష్యమే ప్రభుత్వ ధ్యేయం
- పారిశ్రామిక వేత్తలు, కంపెనీల సీఈవో, ఎండీలతో సీఎం చంద్రబాబు ముఖాముఖి

వినూత్న ఆలోచనలతో రండి



ప్రాజెక్టులను పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబు, కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, తదితరులు

ప్రోత్సాహకాలు అందిస్తాం

గుంటూరు(విద్య), జూలై 18(ఆంధ్రజ్యోతి): నీరుకొండలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో శుక్రవారం గ్రీన్ హైడ్రోజన్ సమ్మిట్-2025 సదస్సు జరిగింది. ఈ సదస్సుకు దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన పారిశ్రామిక వేత్తలు, పరిశోధకులు, పలు కంపెనీల సీఈవోలు, ఎండీలు హాజరయ్యారు. సదస్సుకు ముఖ్య అతిథిగా విచ్చేసిన సీఎం చంద్రబాబు నాయుడు కంపెనీల ప్రతినిధులతో ముఖాముఖి మాట్లాడారు. ప్రస్తుతం సిమెంటు, ఉక్కు, ట్రాన్స్ పోర్టు తదితర పరిశ్రమలకు అవసరమైన విద్యుత్, ఇంధనం సరఫరాకు కాలుష్యం వెదజల్లే ఉద్గారాలను వినియోగించాల్సి వస్తోందని సీఎం అభిప్రాయపడ్డారు. దీని వల్ల కాలుష్యం పెరిగిపోయి.. పర్యావరణం కలుషితం కావడంతోపాటు అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సవాళ్లను అధిగమించేలా పరిశోధనలు చేసి పరిష్కారం అన్వేషించాలని వారికి సూచించారు.

భవిష్యత్తు అంతా గ్రీన్..

ముఖ్యంగా గ్రీన్ హైడ్రోజన్ పరిశోధనలకు, కంపెనీల ఏర్పాటుకు ఇక్కడ అనేక అవకాశాలు ఉన్నాయని సీఎం చంద్రబాబు వెల్లడించారు. జీరో కార్బన్ లక్ష్యాల సాధనకు గ్రీన్ హైడ్రోజన్ లాంటి ఇంధనమే సరైన పరిష్కారమని ఆయన (మిగతా 6వ పేజీలో)

'రానున్న రోజుల్లో గ్రీన్ హైడ్రోజన్ విస్తృతంగా వినియోగంలోకి రానుంది. ప్రాజెక్టులు ఏర్పాటు చేసేందుకు వినూత్న ఆలోచనలు, సాంకేతికతతో వచ్చే ఆవిష్కర్తలకు, పారిశ్రామికవేత్త లకు ప్రభుత్వం పెద్ద పీట వేస్తుంది. పరిశ్రమలకు, ప్రాజెక్టులకు అవసరమైన అన్నిరకాల ప్రోత్సాహకాలు అందిస్తాం'

- సీఎం, చంద్రబాబునాయుడు

గాంధీ జయంతికి.. స్వచ్ఛాంధ్ర బహుమతి!

గాంధీ జయంతికి 'స్వచ్ఛాంధ్ర'ను రాష్ట్ర ప్రభుత్వం బహుమతిగా ఇవ్వనుంది. మునిసిపాలిటీల కంపోస్టు యార్డుల్లో పేరుకు పోయిన చెత్త నిల్వలను పూర్తిగా తొలగించేందుకు లక్ష్యంగా పెట్టుకుంది. వ్యర్థాల నుంచి కూడా సంపద సృష్టించేలా ప్రణాళికాబద్ధంగా ముందు కెళ్తోంది. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లోని కార్పొరేషన్లు, మునిసిపాలిటీల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యమిస్తూ.. రూ.30.35 కోట్ల నిధులు కేటాయించింది. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొనేలా పనులు చేయిస్తోంది.

- కంపోస్టు యార్డుల్లో పేరుకుపోయిన చెత్తకు మోక్షం
- రూ.30.35 కోట్లతో చెత్త శుద్ధి పనులు
- అక్టోబరు 2వ తేదీ కల్లా తొలగింపు దిశగా చర్యలు
- స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ నుంచి నిధులు

(అద్దంకి, ఆంధ్రజ్యోతి) : మునిసిపాలిటీల కంపోస్టు యార్డుల్లో టన్నుల కొద్ది చెత్త నిల్వలు పేరుకుపోయాయి. వ్యర్థాలు కుళ్లి కంపుకొడుతున్నాయి. రోజూ సేకరించిన చెత్త అక్కడ వేసే పరిస్థితి లేదు. వైసీపీ ప్రభుత్వం హయాంలో యార్డుల్లో చెత్త తొలగింపు పనులు చేపట్టి, నిలిపివేశారు. అలాగే పెద్ద ఎత్తున నిధులు దుర్వినియోగం అయ్యాయి. చెత్త తొలగింపునకు లెక్కలు కూడా నాడు లేవు. కూటమి ప్రభుత్వం మునిసిపాలిటీల కంపోస్టు యార్డుల్లో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించేందుకు చర్యలు చేపట్టింది. స్వచ్ఛాంధ్ర (మిగతా 6వ పేజీలో)



నరసరావుపేట కంపోస్టు యార్డులో చెత్తశుద్ధి పనులు

మున్సిపాల్టీల వారీగా పేరుకుపోయిన వ్యర్థాలు

మునిసిపాల్టీ	తొలగించనున్న వ్యర్థాలు టన్నుల్లో
చిలకలూరిపేట	1,66,278
నరసరావుపేట	30,609
మాచర్ల	30,894
పిడుగురాళ్ల	10,793
వినుకొండ	11,195
దాచేపల్లి	6,194
గురజాల	1,675
గుంటూరు	43,811
పొన్నూరు	8,376
బాపట్ల	46,264
రేపల్లె	7,203

విషపు రాతలతో దుష్ప్రచారం

- పొగాకు రైతుల్లో భయాందోళనలు
- అసత్య కథనాలు మానుకోవాలన్న సుబ్బారెడ్డి

(బాపట్ల, పర్చూరు, ఆంధ్రజ్యోతి)

కంపెనీల నిరాకరణతో కొనుగోళ్లు లేక అల్లాడుతున్న వారిని ఆదుకునేందుకు ప్రభుత్వం రంగంలోకి దిగడంపై పొగాకు రైతుల్లో హర్షం చేస్తున్నారు. అయితే జగన్ పత్రిక విషపు రాతలతో భయాందోళనలు కలిగేలా వైసీపీ దుష్ప్రచారం చేస్తోందని రైతులు ధ్వజమెత్తుతున్నారు. మార్క్‌ఫెడ్ ద్వారా బర్లీ పొగాకు మొత్తాన్ని కొనాలని ప్రభుత్వం నిర్ణయించి చర్యలు తీసుకుంటోంది. రెండు నెలల్లో చివరి ఆకు వరకు కొనుగోలు చేస్తామని ఇప్పటికే ప్రకటించింది. కానీ ఇవేమీ పట్టని జగన్ పత్రిక ప్రభుత్వంపై విషం చిమ్ముతోందని రైతులు విమర్శిస్తున్నారు. కేవలం రైతులను రెచ్చగొట్టేందుకు, ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉసిగొల్పేందుకు తప్పుడు కథనాలను ప్రచురిస్తోందంటున్నారు. తన పంటను ప్రభుత్వం కొనడం లేదని నిరసిస్తూ ట్రాక్టర్‌తో తొక్కించారంటూ ప్రచురించిన కథనంలో వాస్తవం లేదని పర్చూరు మండలం నూతలపాడుకు చెందిన బాధిత రైతు గుదిబండి సుబ్బారెడ్డి చెప్తున్నా.. స్థానిక ఎమ్మెల్యే బెదిరించారని ఆ పత్రిక నానాయాగీ చేయడంపై గ్రామస్తులు మండిపడుతున్నారు. రైతుల్లో భయాందోళనలు సృష్టించడం, ఏదో జరిగిపోతుందనే తప్పుడు సంకేతాలు పంపించే దిశగా విషపు రాతలు ఉన్నాయని పలువురు అభిప్రాయపడుతున్నారు.

రెండు నెలలు పైనే...

కొనుగోళ్ల ప్రక్రియ దాదాపు రెండు నెలలుపైనే పడుతుందని, రైతులెవరూ కంగారు పడవద్దని మంత్రి అచ్చెన్నాయుడు మార్టూరు వేదికగా ఇప్పటికే ప్రకటించారు. బర్లీ పొగాకు కొనుగోలుకు మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దింపాలనుకున్నప్పుడే ఆ ప్రక్రియలో ఎదురయ్యే సమస్యలపై రైతులను అధికారులు చైతన్యపరిచారు. పైగా ప్రభుత్వం రూ.273 కోట్లు కేటాయించింది. ఇప్పటికే కొనుగోలు చేసిన రైతుల ఖాతాల్లో నగదు జమ కానున్నది. ఇలా రైతులను ఆదుకునే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకెళ్తోంది. రైతులంతా ఒక్కసారిగా కొనుగోలు కేంద్రాల బాట పడితే గందరగోళం నెలకొంటుందని భావించిన అధికారులు సీఎంయాప్‌లో రిజిష్టర్, తర్వాత సెల్‌ఫోన్‌కు మెసేజ్ వచ్చినప్పుడే పంటను నిర్దేశించిన కొనుగోలు కేంద్రానికి తీసుకు వచ్చేలా చేస్తున్నారు. ఈ ప్రకారం కొనుగోళ్లు జరుగుతున్నాయి. బర్లీ పొగాకు కొనుగోలుకు మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దింపాలనుకున్నప్పుడే ఆ ప్రక్రియలో ఎదురయ్యే సమస్యలపై రైతులను చైతన్య పరచాలనుకుంది. వెంటనే తమ పంట కొనుగోలు చేయకపోవడంతో కంగారు పడుతున్న రైతులే లక్ష్యంగా వైసీపీ నేతలు, వారి పత్రిక దుష్ప్రచారానికి తెరతీస్తోంది.

నన్నెవరూ బెదిరించలేదు : సుబ్బారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న సుబ్బారెడ్డి

నన్నెవరు బెదిరించలేదు భయపెట్టలేదు.. జగన్ పత్రిక తప్పుడు కథనాలతో ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీస్తూ భయభ్రాంతులకు గురిచేస్తోందని పర్చూరు మండలం నూతలపాడుకు చెందిన గుదిబండి సుబ్బారెడ్డి తెలిపారు. శుక్రవారం సాక్షి పత్రికలో వెలువడిన కథనంపై విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి మరీ ఆయన మండిపడ్డారు. పాడైన పనికిరాని పొగాకును పొలానికి ఎరువుగా వినియోగించేందుకు తొక్కించానన్నారు. దీనిపై ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఫోన్ చేసి తనను పరామర్శించారన్నారు. పనికిరాని పొగాకును మాత్రమే ఎరువుగా వినియోగించానని మిగిలిన పంట అంతా విక్రయానికి సిద్ధం చేసి గోదాములో భద్రపరిచినట్లు తెలిపారు.

ఆనందం వెద జల్లుతున్నారు



8

102 ఎకరాల భూమికి విముక్తి

20 రోజుల్లో సమస్య పరిష్కారంపై రైతుల హర్షం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జె.వెంకటమురళి, హాజరైన ముత్తుపల్లి గ్రామ రైతులు

బాపట్ల జూలై 18 (ఆంధ్రజ్యోతి): నిజాంపట్నం మండలం ముత్తుపల్లి గ్రామంలో ఆరు దశాబ్దాలుగా 22ఏలో ఉన్న 102 ఎకరాల భూమికి విముక్తి కల్పిస్తున్నట్లు కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. గ్రామ రైతులతో శుక్రవారం కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో ఈ మేరకు కలెక్టర్ తెలిపారు. గ్రామంలోని 87 మందికి రైతువారి పట్టాభూమి కింద పాస్ పుస్తకాలు ఇస్తామని పూర్తి స్థాయిలో యాజమాన్య హక్కులు కల్పిస్తామని హామీ ఇచ్చారు. 1987లో పోరంబోకు భూములుగా నమోదు చేశారని దీంతో 22ఏ నిషేధిత జాబితాలోకి వెళ్ళిపోయాయని తెలిపారు. దశాబ్దాల క్రితం దస్త్రాలను పరిశీలించగా ఆ భూములు 87మంది రైతులవని తేలిందన్నారు. గతంలో పనిచేసిన రెవెన్యూ అధికారులు తప్పుగా నమోదు చేయడంతో ఆరు దశాబ్దాలుగా ఇబ్బందులు పడుతున్నామని 20 రోజుల క్రితం విన్నవించగా కలెక్టర్ స్పందించి సమస్యను పరిష్కరించారని రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో రేపల్లె ఆర్డీవో రామలక్ష్మి, నిజాంపట్నం తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

జీవోకు తూట్లు.. లక్షల్లో వసూళ్లు

నిబంధనలకు విరుద్ధంగా..

గ్రేడ్-3 ఏఎన్ఎంల బదిలీల్లో అక్రమాలు ● వందమందికి సొంత మండలంలోనే పోస్టింగ్


- వేమూరు మండలం వరహాపురం ఏఎన్ఎంను అదే మండలంలోని బలిజేపల్లికి, కుచ్చళ్ల పాడులోని ఏఎన్ఎంను వరహాపు రానికి, పెనుమర్రు ఏఎన్ఎంను జంపనికి మార్చారు.
- చుండూరు మండలం శ్రీ రంగపురం నుంచి ఏఎన్ఎంను అదేమండలంలోని వేటపాలేనికి, తొట్టెంపూడి ఏఎన్ఎంను మోదుకూరుకు, అంబేద్కర్‌నగర్ ఏఎన్ఎంను పెనుగుదురుపాడుకి మార్చారు.
- భట్టిప్రోలు మండలం ఐలవరం-1, ఐలవరం-2ల్లోని ఏఎన్ఎంలను అటుఇటు మార్చారు.
- పెదనందిపాడు-1 ఏఎన్ఎంను అదే మండలంలోని వరగానికి, పెదనందిపాడు-2 ఏఎన్ఎంను పెదనందిపాడు-1కు బదిలీ చేశారు. గోగులమూడి ఏఎన్ఎంను సొంత మండలంలోనే నియమించారు.

గుంటూరు సిటీ, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాలో తాజాగా జరిగిన గ్రేడ్-3 ఏఎన్ఎం (యాక్జలరీ నర్స్ ఫర్ మిడ్ వైఫరీ)ల బదిలీల్లో భారీ అక్రమాలు జరిగాయి. వైద్య, ఆరోగ్య శాఖలో పని చేస్తున్న ఏఎన్ఎంలు కోరుకున్న చోటకు బదిలీ అయ్యేందుకు భారీగా ముట్టజెప్పినట్లు తెలుస్తుంది. అడిగినంత ఇచ్చిన వారి కోసం అధికారులు కూడా జీవో నిబంధనలకు తిలోదకాలు ఇచ్చారు. అవినీతి వ్యవహారాలు ఆరోగ్య శాఖకు కొత్త కానప్పటికీ ఈసారి మోతదు మరీ పెరిగిపోవడంతో విషయం రచ్చకెక్కింది. జూన్ 12న విడుదలైన జీవో 5 ప్రకారం ఐదేళ్లు దాటిన వారికి కచ్చితంగా స్థానచలనం జరగాలి.. ఉద్యోగులను సొంత మండలంలో ఉంచడానికి వీలులేదు. అయితే ఈ నిబంధనను వైద్యఆరోగ్య శాఖలో పక్కన పెట్టేశారు. మొత్తం 977 మంది గ్రేడ్-3 ఏఎన్ఎంలకు కౌన్సెలింగ్ నిర్వహించగా వందమందికిపైగా సొంత మండలాల్లోనే నియమించారు. సొంత మండలం దాటితే ఇబ్బందని భావించిన ఉద్యోగులు అక్కడే ఉండేందుకు రూ.లక్షల్లో ముడుపులు ఇచ్చేందుకు సిద్ధపడ్డారు. ఇది గుంటూరులోని వైద్య, ఆరోగ్య శాఖ అధికారులకు బాగా కలిసి వచ్చింది.

అటెండర్... సూపర్‌వైజర్ హవా..

గ్రేడ్-3 ఏఎన్ఎంల బదిలీలు గుంటూరు డీఎంహెచ్ కార్యాలయంలోని ఓ అటెండర్, ఓ సూపర్‌వైజర్ కనుసన్నల్లో జరిగిందన్న ఆరోపణలున్నాయి. ఎంతోకాలంగా అక్కడ తిష్ట వేసిన వీరు ముఖ్య అధికారికి, ఏఎన్ఎంలకు మధ్య రాయబేరాలు నడిపినట్లు సమాచారం. సొంత మండలంలో ఉంచడానికి ఒక్కొక్కరి వద్ద రూ.లక్ష నుంచి లక్షన్నర వరకు వసూలు చేశారని పలువురు ఆరోపిస్తున్నారు. నగదు ముట్టజెప్పిన వారికి లబ్ధి చేకూర్చేందుకు అధికారులు ఖాళీలను బ్లాక్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ క్రమంలోనే బదిలీల జాబితాను పదే పదే మార్చినట్లు సమాచారం. పల్నాడు జిల్లా నరసరావుపేటలో జరిగిన నియామకాలన్నీ అక్రమంగా జరిగాయని సమాచారం. ఈ అక్రమాలు వెలుగులోకి రావాలంటే విజిలెన్స్ విచారణ జరిపించాలని పలువురు కలెక్టర్‌కు విజ్ఞప్తి చేస్తున్నారు.

వైద్య, ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయం



గాంధీ జయంతికి.. 'స్వచ్ఛాంధ్ర' బహుమతి!

(5వ పేజీ తరువాయి)

కార్పొరేషన్ ద్వారా పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లోని మునిసిపాలిటీల్లో చెత్త శుద్ధికి రూ.30.35 కోట్లు నిధులు విడుదల చేసింది. టెండర్ ప్రక్రియ ద్వారా మహాత్మా గాంధీ జయంతి అక్టోబరు 2వ తేదీ కల్లా వ్యర్థాలను తొలగించే దిశగా పనులు నిర్వహిస్తున్నారు.

3.63 లక్షల మెట్రిక్ టన్నుల చెత్త శుద్ధి

పల్నాడు జిల్లాలోని నరసరావుపేట, చిలకలూరిపేట, మాచర్ల, పిడుగురాళ్ల, వినుకొండ, దాచేపల్లి, గురజాల, గుంటూరు జిల్లాలోని గుంటూరు కార్పొరేషన్, పొన్నూరు, బాపట్ల జిల్లాలోని రేపల్లె, బాపట్ల కార్పొరేషన్ సహా మొత్తం 11 చోట్ల పనులు జరగుతున్నాయి. 3.63 లక్షల మెట్రిక్ టన్నుల చెత్త శుద్ధి చేయాలని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ లక్ష్యంగా పెట్టుకుంది. కంపోస్టు యార్డుల్లో పేరుకుపోయిన చెత్తను ఎరువుగా మర్చే ప్రక్రియ జరుగుతోంది. ఇందుకు సంబంధించి యార్డుల్లోనే యంత్రాలను ఏర్పాటు చేశారు.

వ్యర్థాల తొలగింపు ఇలా..

రెడ్‌బే టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు చెత్త తొలగింపు పనులను స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ అప్పగించింది. చెత్తలో ఉన్న ప్లాస్టిక్ కవర్లను వేరు చేసి అవసరమైన కంపెనీలకు తరలిస్తారు. వ్యర్థాల్లో వస్త్రాలు, మట్టి, రాళ్లు, ప్లాస్టిక్‌ను యంత్రాల ద్వారా వేరు చేస్తారు. ఇలా వచ్చే మట్టిని మునిసిపాలిటీల్లో లోలెవల్ ప్రాంతాలకు వినియోగించనున్నారు. మొత్తం మీద మునిసిపాలిటీల కంపోస్టు యార్డుల వద్ద రహదారులపై గుట్టలు గుట్టలుగా పేరుకుపోయిన వ్యర్థాలను పూర్తిగా శుభ్ర పరచనున్నారు. వ్యర్థాలను యార్డులకు తరలించే పరిస్థితి లేక.. రహదారుల మార్జిన్‌లలో తగలబెట్టె పరిస్థితి కూడా ఇక ఉండదు. ఇక మీదట తడి పొడి చెత్తను కచ్చితంగా వేరు చేయాలని మునిసిపాలిటీలను స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఆదేశించింది. ఘన వ్యర్థాలను విద్యుత్ ఉత్పతి ప్లాంట్‌లకు తరలించాలని నిర్ణయించారు. ఈ ప్రక్రియ పూర్తి స్థాయిలో అమలు జరిగితే పట్టణాల్లో పరిశుభ్రత నెలకొనే అవకాశం ఉంది.

మద్యం మత్తులో ట్రాన్స్‌ఫార్మర్ పట్టుకుని..

● విద్యుదాఘాతంతో యువకుడికి గాయాలు


గాయపడిన యువకుడు

కొల్లూరు, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : మద్యం మత్తులో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను పట్టుకున్న యువకుడు షాక్‌కు గురై గాయపడిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. కొల్లూరు ఎస్‌సి కాలనీకి చెందిన గొరికపూడి కిరణ్‌కుమార్ మద్యం సేవించి.. మత్తులో మూత్ర విసర్జన చేసేందుకు ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లాడు. ట్రాన్స్‌ఫార్మర్‌ను తాకడంతో షాక్‌కు గురై కింద పడిపోయాడు. గమనించిన స్థానికులు వెంటనే ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రానికి తరలించారు. వైద్యులు మెరుగైన చికిత్స కోసం తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు తీసుకు వెళ్లాలని సూచించడంతో 108 అంబులెన్స్‌లో తరలించారు. యువకుడిని అక్కడి వైద్యులు పరిశీలించి ప్రాణాపాయం లేదని తెలిపారు.

ఓపెన్ స్కూల్ అడ్మిషన్లు ప్రారంభం

● ఈ నెల 30 వరకు గడువు: డీఈవో రేణుక

గుంటూరు(విద్య), జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం దూర విద్య ప్రవేశాలు(ఓపెన్ స్కూల్)-2025-26 సంవత్సరానికి ప్రారంభమయ్యాయని జిల్లా విద్యా శాఖాధికారి సి.వి.రేణుక శుక్రవారం తెలిపారు. అపరాధ రుసుం లేకుండా ఈ నెల 30వ తేదీ వరకు అడ్మిషన్లకు పొంద వచ్చని పేర్కొన్నారు. 15 ఏళ్లు నిండిన వారికి ఇంటర్ విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. 10వ తరగతి, ఇంటర్మీడియట్‌లో ఉత్తీర్ణత సాధించనవారికి వారికి కూడా అవకాశం ఉందన్నారు. ఇతర వివరాల కోసం అభ్యర్థులు తమ ప్రాంతంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో లేదా దూరవిద్య కేంద్రాల్లో సంప్రదించాలని సూచించారు.

నేడు గుంటూరు నగరానికి

మంత్రి లోకేశ్

గుంటూరు(విద్య), జూలై 18 (ఆంధ్రజ్యోతి): ది ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టెడ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా(ఐసీఏఐ) ఆధ్వర్యంలో శనివారం గుంటూరులో జరిగే సదస్సుకు రాష్ట్ర ఐటీ, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ హాజరుకానున్నారు. స్థానిక అమరావతి రోడ్డులోని బండ్లమూడి గార్డెన్స్‌లో సీఏ నిపుణులతో ముఖాముఖి మాట్లాడనున్నారు. ప్రతిభావంతులైన విద్యార్థులకు పురస్కారాలు అందజేస్తారు. సీఏ కోర్స్ కోర్సు పూర్తి చేయడానికి ఐసీఏఐ సహకారం గురించి వివరించనున్నట్లు ఐసీఏఐ అధ్యక్షుడు ప్రసన్నకుమార్ వెల్లడించారు.

గుండె సమస్యలకు కేఎల్‌యూ విద్యార్థిని నూతన పరిష్కారం


శ్రేయ కొసనం

తాడేపల్లి (వడ్డేశ్వరం), జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఎంటీఎంసీ పరిధిలోని కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీ ఫార్మసీ కళాశాల పరిశోధన విద్యార్థిని శ్రేయ కొసనం గుండె సంబంధిత సమస్యలకు మొక్కల ఆధారిత చికిత్సలకు నూతన పరిష్కారాలు కనుగొన్నట్లు వర్సిటీ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చక్రవర్తి శుక్రవారం తెలిపారు. డాక్టర్ రాజేశ్వరి పసుపుల మార్గదర్శకత్వంలో గుండె సంబంధిత వ్యాధులపై పరిశోధన చేసిన శ్రేయ సాంప్రదాయ మొక్కల నుంచి గుండెకు ఏర్పడే పలు రకాల సమస్యలకు ఔషధాలు తయారు చేయవచ్చనే పరిశోధనకు శ్రేయ ఫార్మసీ కళాశాల నుంచి పీహెచ్‌డీ డిగ్రీని అందుకున్నట్టు తెలిపారు. ఆమె చేసిన పరిశోధనను మెడికల్ భాషలో ఇన్విస్టిగేషన్స్ ఆన్ మిథైల్ గ్లైకోసైడ్ అండ్ సిన్నమోయిల్ డెరివేటివ్ ఫ్రమ్ అగనోస్మ డైకోటోమా ఎగనెస్ట్ మయోకార్డియల్ ఇస్కీమియా రి పెరిఫ్యూజం ఇంజరీ ఇంటిగ్రేటింగ్ కంప్యూటేషనల్ టెక్నిక్స్ విత్ సెల్‌లైన్ వ్యాలిడేషన్ యూజింగ్ హెచ్9సీ2 కార్డియో ఈ సందర్భంగా ఆమెను కేఎల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చక్రవర్తి, డాక్టర్ బుచ్చినాయుడు, ఆర్ ప్యాక్ చైర్మన్ డాక్టర్ నరేంద్ర అభినందించారు.

పేద కుటుంబాలను ఆదుకోవడమే పీ4 లక్ష్యం

స్వర్ణాంధ్ర-2047 ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ వెలమాటి రామ్‌నాథ్


మాట్లాడుతున్న వెలమాటి రామ్నాథ్

పెదనందిపాడు, జూలై, 18(ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ప్రతి పేద కుటుంబాన్ని ఆదుకోవడమే పీ4 లక్ష్యమని స్వర్ణాంధ్ర - 2047 ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ వెలమాటి రామ్‌నాథ్ పేర్కొన్నారు. స్థానిక పీఏఎస్ కళాశాలలో ఓ కార్యక్రమానికి విచ్చేసిన సందర్భంగా ఆయన విలేకరుల సమావేశం నిర్వహించి, మాట్లాడారు. గ్రామాల్లో పేద కుటుంబాలను గుర్తించి, వారిని ఆదుకునేందుకు ఆ గ్రామంలోనే ఆయా రంగాల్లో అభివృద్ధి చెందిన వారికి అప్పగించి, అన్ని విధాలా ఆదుకునే లక్ష్యంతో సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో 15 లక్షల పేద కుటుంబాలు ఉండగా ఇప్పటికే 5 లక్షల కుటుంబాలను గుర్తించడం జరిగిందనన్నారు. త్వరలో మరో పది లక్షల కుటుంబాలను గుర్తించడం జరుగుతుందని.. దీనిపై ప్రణాళికా బద్ధంగా ప్రభుత్వం అడుగులు వేస్తుందని తెలిపారు. పథకం రూపకల్పనకు మేధావులతో చర్చించి నిర్ణయాలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ పథకాన్ని ప్రధాన మంత్రి అన్ని రాష్ట్రాల్లో ఏర్పాటు చేసేవిధంగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. త్వరలో జిల్లా, నియోజకవర్గ, మండల గ్రామ కమిటీలు కూడా ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. దీనిని ఆగస్టు 15న లాంచనంగా ప్రారంభించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఏఎస్పీ కాళహస్తి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఒప్పంద అధ్యాపకుల రెన్యువల్‌కు ఆహ్వానం

గుంటూరు (విద్య)జూలై 18 (ఆంధ్రజ్యోతి): జోన్-3 పరిధిలోని ప్రభుత్వం డిగ్రీ కళాశాలల్లో ఒప్పంద ప్రాతిపదికన గత సంవత్సరం పనిచేసిన అధ్యాపకుల నుంచి రెన్యూవల్ కోసం దరఖాస్తు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల విద్య సంయుక్త సంచాలకులు పి.కళావతి శుక్రవారం ప్రకటన తెలిపారు. అధ్యాపకులు 2024-25 విద్యా సంవత్సరంలో పనిచేసి 60 సంవత్సరాలలోపు వయసు ఉండాలని సూచించారు. ఈ నెల 21లోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. జోన్ 3 పరిధిలో ఉమ్మడి గుంటూరు, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లోని ప్రభుత్వ డిగ్రీ, ఓరియంటల్ కళాశాలల్లో పనిచేయాల్సి ఉంటుందని తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 39, ఓరియంటల్ కళాశాలల్లో 10 పోస్టులు రెన్యువల్ చేస్తామని తెలిపారు. ఇతర వివరాల కోసం ఆయా జిల్లాల్లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో సంప్రదించాలని తెలిపారు.

జంతు శాస్త్ర అధ్యాపక పోస్టుకు..

ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో(గుంటూరు) జంతు శాస్త్రం అధ్యాపక పోస్టుకు దరఖాస్తు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ వీఆర్ జ్యోత్స్నకుమారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థికి 55 సంవత్సరాలోపు వయసు, జాతీయ స్థాయి అర్హత పరీక్ష పూర్తి చేసి, పీహెచ్‌డీ ఉన్నవారికి అవకాశం కల్పిస్తామని తెలిపారు. ఈ నెల 22న కళాశాల జరిగే ఇంటర్వ్యూకు హాజరుకావాలని సూచించారు.

కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లకు ఎక్స్‌గ్రేషియా

గుంటూరు సిటీ, జూలై 18(ఆంధ్రజ్యోతి): వైద్య, ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లకు ఎక్స్ గ్రేషియా ప్రకటిస్తూ కూటమి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ వీర పాండ్యన్ శుక్రవారం ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేశారు. 2019 ఫిబ్రవరిలో అప్పటి టీడీపీ ప్రభుత్వం రాష్ట్రంలోని కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల కోసం తీసుకొచ్చిన జీఓ నంబరు 25 కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లకు కూడా వర్తిస్తుందని కమిషనర్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ జీఓ ప్రకారం ఉద్యోగులు ప్రమాదవశాత్తు మరణిస్తే.. రూ. 5 లక్షలు, సహజ మరణం పొందితే రూ. 2లక్షలు కుటుంబ సభ్యులకు ప్రభుత్వం అంద జేస్తుంది. దీనిపై ఏపీ మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్లు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నిరంజన్, కార్యదర్శి సందీప్ హర్షం వ్యక్తం చేశారు.

'మందలింపు'తో..

రైలు కింద కాళ్లు పెట్టిన విద్యార్థిని

●కాళ్లు తెగిపోయి మృత్యువుతో పోరాటం

బాపట్ల, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : రైలు కింద పెట్టిన రెండు కాళ్లు తెగిపోయి మృత్యువుతో పోరాడుతున్న విద్యార్థిని విషాద ఘటన ప్రజల్ని కలిచివేసింది. శుక్రవారం జరిగిన ఈ ఘటనపై కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. బాపట్ల పట్టణంలోని 12వ వార్డు వెంగళ్ విహార్‌కు చెందిన విద్యార్థిని ఓ పాఠశాలలో 10వ తరగతి చదువుతోంది. రెండు రోజులు నుంచి విద్యార్థిని పాఠశాలకు వెళ్లక పోవడంతో తల్లి ప్రశ్నించింది. దీంతో పాఠశాల ప్రిన్సిపల్ మందలించారని చెప్పింది. పాఠశాలకు వచ్చి మాట్లాడతామని చెప్పి, స్కూల్‌కు వెళ్లమని బాలికకు తల్లి సూచించింది. దీంతో మనస్థాపానికి గురైన విద్యార్థిని వాష్ రూమ్‌కు వెళ్తున్నట్లు చెప్పి.. జీబీసీ రోడ్డులోని ఆర్‌వోబీ దగ్గర రైలు పట్టాలపై కాళ్లు పెట్టి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఈ ఘటనలో బాలిక రెండుకాళ్లు తెగిపోయాయి. స్థానికులు గుర్తించి హుటాహుటీన బాలికను ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాలిక ఆత్మహత్యాయత్నానికి సంబంధించి భిన్న కథనాలు వినిపిస్తున్నాయి. స్కూల్‌కు వెళ్లడం లేదని తల్లి మందలించడం ఒక వాదన కాగా.. పాఠశాలలో ఉపాధ్యాయులు మందలించారనే మరొక వాదన వినిపిస్తోంది. పూర్తివివరాలు తెలియాల్సి ఉంది. రైల్వే పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించారు. ఆసుపత్రికి వెళ్లి బాలిక వివరాలు నమోదు చేసుకొన్నారు. రెండు కాళ్ళు తెగిపోయినట్లు వైద్యులు చెప్పారని ఈ మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వినూత్న ఆలోచనలతో రండి!

(5వ పేజీ తరువాయి)

స్పష్టం చేశారు. భవిష్యత్తు అంతా గ్రీన్ హైడ్రోజన్‌దేనని, పారిశ్రామిక రంగంలో విప్లవాత్మక మార్పులకు ఇది శ్రీకారం చుట్టనుందన్నారు. సామాన్యులకు అందుబాటులో ఉండేలా దీనిని ప్రజలకు అందుబాటులోకి తేవాలని సీఎం సూచించారు. రాష్ట్రంలో గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తికి ఇప్పటికే కార్యాచరణ సిద్ధమైందని, ఇందులో పారిశ్రామిక వేత్తలు భాగస్వాములు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కాకినాడలో గ్రీన్ అమ్మోనియా ఉత్పత్తి కూడా త్వరలోనే ప్రారంభం అవుతుందన్నారు. 160 మెగావాట్ల గ్రీన్ హైడ్రోజన్ విద్యుత్ ఉత్పత్తి లక్ష్యాన్ని ఏపీ నిర్దేశించుకుందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. 3 గిగా వాట్ల సామర్థ్యంతో ఎలక్ట్రో లైజర్ల ద్వారా గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి చేయనున్నట్లు ప్రకటించారు. ఇప్పటికే ఏపీలో సౌర, పవన, పంప్డ్ విద్యుత్ ఉత్పత్తికి అపారమైన వనరులు ఉన్నాయని, గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టుల ఏర్పాటుకు 1000 కిలోమీటర్ల కోస్తా తీరం, నీరు అందుబాటులో ఉందని స్పష్టం చేశారు. వచ్చే ఏడాది నాటికి గ్రీన్ ప్రాజెక్టులు పనిచేసే స్థాయి రావాలని చంద్రబాబు అభిలాషించారు.

రూ.51 వేల కోట్ల ఒప్పందాలు

ఏపీలో గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియా ఉత్పత్తి చేసేందుకు రెండు సంస్థలు ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో సదస్సు వేదికగా ట్రాన్సఫర్మేటివ్ అవగాహనా ఒప్పందాలను కుదుర్చుకున్నాయి. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం, సంస్థల ప్రతినిధులు ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. యూకేకు చెందిన యమ్నా సంస్థ రూ.16 వేల కోట్ల పెట్టుబడితో నెల్లూరు జిల్లా కృష్ణపట్నం వద్ద ఏడాదికి మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో ప్లాంట్‌ను ఏర్పాటు చేసేందుకు ఎంఓయూ కుదుర్చుకుంది. అలాగే కేఎస్‌హెచ్ ఇన్‌ఫ్రా సంస్థ మచిలీపట్నంలో 150 కిలో టన్నుల సామర్థ్యంతో గ్రీన్ హైడ్రోజన్, 600 కిలో టన్నుల గ్రీన్ అమ్మోనియా ఉత్పత్తి సామర్థ్యంతో ప్లాంట్లను ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చింది. ఇందుకు రూ.35 వేల కోట్లను పెట్టుబడి పెట్టనుందని ముఖాముఖి తర్వాత జరిగిన సదస్సులో సీఎం చంద్రబాబు ప్రకటించారు. ముఖాముఖి సదస్సులో నీతి అయోగ్ సభ్యులు డాక్టర్ వీకే సారస్వత్, కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి కె.జయానంద్, ఎస్ఆర్ఎం వర్సిటీ ప్రో చాన్సలర్ డాక్టర్ పి.సత్యనారాయణ, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డి నారాయణరావు, హైడ్రోజన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు డాక్టర్ ఆర్‌కే మల్హోత్రా, నేషనల్ కెమికల్ ల్యాబ్(పూనే) డైరెక్టర్ డాక్టర్ ఆశీస్ లేలే, నెడ్ క్యాప్ రాష్ట్ర అధికారి డాక్టర్ కమలాకర్‌బాబు పాల్గొన్నారు.

శ్రీలక్ష్మీ అమ్మవారి ఆలయం హుండీ రాబడి రూ. 51,23,353

దుర్గి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): అడిగొప్పల నిదానంపాటి శ్రీలక్ష్మీ అమ్మవారి ఆలయ హుండీ ఆదాయం శుక్రవారం లెక్కించారు. రూ.51,23,353లు సమకూరినట్లు ఈవో ఆదిశేషు నాయుడు, కోటప్పకొండ ఏసీ చంద్రశేఖర్ తెలిపారు.

తెలుగు భాషా వికాసంపై.. లఘు చలన చిత్ర పోటీలు

గుంటూరు(తూర్పు), జూలై 18: మూడో ప్రపంచ తెలుగు మహా సభలు -2026 సందర్భంగా ఆంధ్ర సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో తెలుగు భాషా వికాసంపై అంతర్జాతీయ లఘు చలన చిత్ర పోటీలు నిర్వహించనున్నట్లు పరిషత్తు అధ్యక్షుడు డాక్టర్ గజల్ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు భాష చారిత్రక వైభవం, ఆంధ్ర సారస్వత దీప్తి, తెలుగు భాషా వికాసం, తెలుగు వెలుగులు, తెలుగు భాషా రక్షణ - ప్రాచుర్యం అంశాలుగా పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. ఎంపికైన చిత్ర ప్రదర్శన వేడుకను గుంటూరు భారతీయ విద్యా భవన్‌లో సెప్టెంబరు 14న నిర్వహిస్తామని తెలిపారు. ఎంట్రీల నిడివి 5 నిమిషాలు మాత్రమే ఉండాలని, 4 నిమిషాలకు తక్కువగా ఉండరాదని తెలిపారు. ఆగస్టు 14 లోపు పంపాలని పేర్కొన్నారు. ఎంట్రీలు "ఏఎస్‌పీ షార్ట్ ఫిలిమ్ కాన్ టెస్ట్' ఎట్‌దిరేట్ మెయిల్‌కు పంపాలన్నారు. ఇతర వివరాలకు 91826 12419 అనే నంబరుకు సంప్రదించాలని సూచించారు.

వాటర్ గ్రిడ్ ప్రాజెక్టుకు స్థల పరిశీలన


మ్యాపులను పరిశీలిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

మాచర్ల రూరల్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విజయపురి సౌత్‌లో గల మేకల గొంది నుంచి జలజీవన్ మిషన్ ద్వారా రూ.1,200 కోట్లతో నియోజకవర్గంతో పాటు పల్నాడు ప్రాంతానికి తాగు నీటిని అందించేందుకు ప్రభుత్వం సంకల్పించింది. ఈ నేపథ్యంలో జిల్లా అరుణ్‌బాబు శుక్రవారం మేకల గొందిలో వాటర్ గ్రిడ్ ఏర్పాటు చేసే స్థలం సర్వే మ్యాపును పరిశీలించారు. అన్ని అనుమతులు మంజూరైతే.. వాటర్ గ్రిడ్ నిర్మాణానికి ముహూర్తం ఖరారు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. గురజాల ఆర్డీవో మురళీకృష్ణ, డీఎఫ్‌వో సందీప్‌కుమార్, తహసీల్దార్ కిరణ్‌కుమార్, ఇరిగేషన్ ఈఈ రమేష్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం


ప్రారంభోత్సవంలో మంత్రి వాసంశెట్టి, ఎమ్మెల్యే పుల్లారావు, కమిషనర్ ఎం కృష్ణతేజ

చిలకలూరిపేట, జూలై 18 (ఆంధ్రజ్యోతి): లింగంగుంట్ల గ్రామంలో రూ.30 లక్షల వ్యయంతో నిర్మించిన తాగునీటి పైప్‌లైన్ పథకాన్ని శుక్రవారం రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్ ఎం.కృష్ణ తేజ ప్రారంభించారు. తమ గ్రామానికి శాశ్వతంగా మంచినీటి సమస్యకు.. పరిష్కారం చూపిన ఆనందంలో గ్రామస్తులు వారికి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కృష్ణ తేజ మాట్లాడుతూ సాధారణంగా ఇటువంటి అభివృద్ధి పనులు స్థానిక నిధులతో పూర్తి చేసుకోవాల్సి ఉంటుందన్నారు. ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు కోరిక మేరకు.. సమస్య తీవ్రతను గుర్తించి జడ్పీ నిధులతో ఈ పథకం పూర్తి చేయించినట్లు చెప్పారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా వారు గ్రామంలో పర్యటించారు.

పెట్రోల్‌కు బదులు నీళ్లు కొట్టారు

● బంకు ముందు వాహనదారుల ఆందోళన..

మాచవరం, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : మాచవరం పెట్రోల్ బంకులో పెట్రోల్‌కు బదులు నీరు కొట్టడంతో వాహనదారులు బంకు ముందు ఆందోళన చేపట్టారు. శుక్రవారం బంకులో పెట్రోల్ కొట్టించుకున్న వినియోగదారులు కొంతదూరం వెళ్లే సరికి వాహనాలు ఆగి పోవడంతో.. నెట్టుకుంటూ పెట్రోల్ బంకు వద్దకు వచ్చారు. అంతలోనే బంకు వద్ద మరి కొంత మంది వినియోగదారులు నీరు కొడుతున్నారంటూ బంకు యజమానులను నిలదీశారు. ఈ విషయమంతా దావనంలా వ్యాపించటంతో సుమారు వంద మంది వరకు వినియోగదారులు గుమిగూడి బంకు నిర్వాహకులను నిలదీశారు. వారి నుంచి సరైన సమాధానం రాలేదు. అదే బంకులో మరో ట్యాంకు ద్వారా పెట్రోల్ మంచిగానే వస్తుందని నిర్వాహకులు, వినియోగదారులు గమనించారు. ఐతే పెట్రోల్‌లో నీరు ఎలా కలిసిందనే విషయంపై నిర్వాహకులు చెప్పలేక పోవడంతో.. వినియోగదారులకు పరిహారం చెల్లించేందుకు ఒప్పుకున్నారు. ఈ విషయంపై తహసీల్దార్ నాగమల్లేశ్వరరావును వివరణ కోరగా ఈ విషయం తమ దాకా రాలేదని, నిపుణులతో కలసి పెట్రోల్ బంకును తనిఖీ చేసి నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.


మాచవరం పెట్రోల్ బంకులో ఆందోళన చేస్తున్న వాహనదారులు

కుక్కలు వెంటపడటంతో.. బైక్‌పై నుంచి పడి మహిళ మృతి

బాపట్ల, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : కుక్కలు వెంట పడడంతో.. బైక్‌పై నుంచి మహిళ కింద పడి మృతి చెందిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. పోతురాజు కొత్తపాలెం గ్రామానికి చెందిన వారి చెన్నమ్మ (49), భర్త బుల్లిరెడ్డితో కలిసి ఉదయం మార్కెట్‌కు వచ్చారు. తిరిగి వెళ్తుండగా.. జీబీసీ రోడ్డులో పోలేరమ్మ తల్లి దేవాలయం వద్ద కుక్కలు వెంటపడ్డాయి. భయంతో బైక్ స్పీడ్ పెంచడంతో చెన్నమ్మ కింద పడిపోయింది. తలకు తీవ్రగాయమై మృతి చెందింది. ఈ మేరకు పట్టణ ఎస్ఐ చంద్రావతి కేసు నమోదు చేశారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, జూలై 18 (ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో శుక్రవారం 13.59 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు ప్రాజెక్టు ఏఈ తెలిపారు. పవర్ జనరేషన్ ద్వారా 3,600 క్యూసెక్కులు, లీకుల ద్వారా నాలుగు వందల క్యూసెక్కులు.. మొత్తం నాలుగు వేల క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతోంది.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.20 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	106, 114, 125
చికెన్ విత్ స్కిన్(కిలో)	204.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	214.00

44,297 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు శుక్రవారం 40,141 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 44,297 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 3,365 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఆర్మూరు	9600	10800
334	9500	13000	**ఏసీ కామన్ వెరైటీ**		
నెంబరు. 5	10000	13300	334	9500	12800
273	----	-----	నెంబరు. 5	10000	13500
341	10000	13600	273	---	----
4884	----	---	341	10000	13700
సూపర్ 10	10000	13000	4884	10000	12400
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	10000	14000	తేజ	10000	13800
షార్క్-1	-----	----	బ్యాడిగి	10000	12700
బ్యాడిగి	10000	12400	దేవనూరు డీలక్స్	10000	12600
దేవనూరు డీలక్స్	10000	12400	తాలుకాయలు	4500	7000

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె



పెన్సిళ్ళపై నెల్సన్‌మండేలా జీవిత చరిత్ర, మహాభారతంలో 700 శ్లోకాలను అత్యంత సూక్ష్మంగా చెక్కి కలెక్టర్‌కు చీరాల ఎమ్మెల్యే ఎం.ఎం.కొండయ్యతో కలిసి అందజేస్తున్న మైక్రో అర్టిస్ట్ అన్నం మహిత

మైక్రో అర్టిస్ట్ మహితకు ఆర్థిక ప్రోత్సాహం

బాపట్ల, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని చీరాలకు చెందిన మైక్రో అర్టిస్ట్ అన్నం మహితను కలెక్టర్ జె.వెంకటమురళి అభినందించారు. మహిత తన అద్భుతమైన కళాప్రతిభతో 93 పెన్సిళ్ళపై నెల్సన్ మండేలా జీవిత చరిత్రను, మరో 810 పెన్సిళ్ళపై మహాభారతంలోని 700 శ్లోకాలను అత్యంత సూక్ష్మంగా చెక్కి అందరి ప్రశంసలను అందుకున్నారు. శుక్రవారం చీరాల ఎమ్మెల్యే ఎం.మాలకొండయ్యతో కలిసి కలెక్టర్ కార్యాలయానికి వచ్చిన మహిత కలెక్టర్ జె.వెంకటమురళికి వాటిని అందజేశారు. మహిత ప్రతిభను కలెక్టర్ అభినందించారు. ఈసందర్భంగా ఆమె కుటుంబ ఆర్థిక పరిస్థితులను అడిగి తెలుసుకున్న కలెక్టర్ తనవంతు సాయంగా 15 వేల రూపాయల చెక్కును మహితకు అందజేశారు. ప్రతిభావంతులను ప్రోత్సహిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో చీరాల ఎమ్మెల్యే ఎం.మాలకొండయ్య తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను సన్మానించిన ఫోరం ఫర్ ఆర్టీఐ

బాపట్ల, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : చీరాల కుప్పడం చేనేత చీరకు జాతీయఅవార్డు రావటం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ కలెక్టర్ జె.వెంకటమురళిని శుక్రవారం ఫోరంఫర్ ఆర్టీఐ రాష్ట్రఅధ్యక్షులు ఆవుల వెంకటేశ్వర్లు నాయకులతో కలిసి సన్మానించి అభినందనలు తెలిపారు. ఈవిధంగా అవార్డు రావటం సంతోషదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు దేవరకొండ రాము, బ్రహ్మారెడ్డి, మద్దిబోయన అమృత్‌రాజు, ఏబేలు తదితరులు ఉన్నారు.

పార్టీలకు అతీతంగా మాజీ సైనికులకు అండగా ఉంటా

● ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

బాపట్ల, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : పార్టీలకు అతీతంగా మాజీ సైనికులకు అండగా ఉంటానని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ తెలిపారు. పట్టణంలోని సూర్యలంకరోడ్డులో తెలుగుదేశంపార్టీ కార్యాలయం నందు శుక్రవారం నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ఎమ్మెల్యే ప్రజల సమస్యలు అడిగి తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా మాజీసైనిక సంక్షేమసంఘం రాష్ట్రఅధ్యక్షులు తాంర్డ సాంబశివరావు అసోసియేషన్ నాయకులతో కలిసి వెళ్ళి ఎమ్మెల్యేకు పలువిషయాలు వివరించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు కమిటీ ఛైర్మన్ కావూరి శ్రీనివాసరెడ్డి, బాపట్ల అసోసియేషన్ అధ్యక్షుడు పుట్టా ఆదిశేషారెడ్డి, కార్యదర్శి షేక్ మొహిద్దీన్, జాయింట్ సెక్రటరి పీటా సారథి, కోశాధికారి పువ్వాడ యలమంద, రాష్ట్ర కమిటీ నాయకులు సుంకర శేషగిరిరావు, సాంబశివారెడ్డి, మాధవిలత తదితరులు ఉన్నారు.



ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మకు అభినందనలు తెలియజేస్తున్న మాజీ సైనిక సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తాంర్డ సాంబశివరావు, సభ్యులు

లబ్ధిదారుడికి ఆటో అందజేత

బాపట్ల, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని 24వ వార్డు డ్రైవర్స్ కాలనీకి చెందిన పఠాన్ ఫిరోజ్‌ఖాన్‌కు పట్టణ సమైక్య ఆధ్వర్యంలో శుక్రవారం బ్యాటరీ ఆటోను ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ చేతులమీదగా అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణానికి 36 ఆటోలు టార్గెట్‌గా ఇవ్వటం జరిగిందన్నారు. వీటిలో 15 శాతం టార్గెట్ పూర్తయితే ఇక్కడే ర్యాపిడో సంస్థ ఏర్పాటు చేసి ఒక్కొక్క ఆటోపై రూ.56 వేలు సబ్సిడీ ఇవ్వటం జరుగుతుందన్నారు. ఇందులో లబ్ధిదారుడు రూ.40 వేలు చెల్లిస్తే మిగిలిన సొమ్ము బ్యాంక్ రుణంగా ఇవ్వటం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. మెప్మా సీవోలు ఇచ్చిన టార్గెట్ పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో కమిషనర్ జి.రఘునాథరెడ్డి, డీఆర్‌డీఏ పీడీ ఎ.శ్రీనివాసరావు, సీఎంఎం నర్రా సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతకు ఎమ్మెల్యే సన్మానం

అంతర్జాతీయ అవార్డు అందుకున్న ఫోటోగ్రాఫర్ పీవీఎస్ నాగరాజును ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ శుక్రవారం సన్మానించారు. ఈసందర్భంగా అవార్డు పొందిన ఫోటోగ్రఫీని ఎమ్మెల్యేకు ఆయన అందజేశారు. ఈవిధంగా అవార్డులు అందుకోవటం అభినందనీయమని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

ఏడాది పాలనలో ఎన్నో అభివృద్ధి, సంక్షేమ పథకాలు

● టీడీపీ నాయకుడు జిట్టా శ్రీనివాసరావు



సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న టీడీపీ నాయకుడు జిట్టా శ్రీనివాసరావు తదితరులు

బాపట్ల, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో ఎన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసినట్లు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు జిట్టా శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని 20వ వార్డు భీమావారిపాలెంలో శుక్రవారం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని పార్టీశ్రేణులతో కలిసి ఆయన నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ కరపత్రాలు పంచుతూ కార్యక్రమాలు గురించి వివరించారు. సమస్యలు అడిగి తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్యదర్శి అందెల మల్లేశ్వరరావు, బొమ్మిశెట్టి శివరామకృష్ణ, కావటి బాజి, సత్యేంద్రకుమార్, గుగ్గిలం లక్ష్మీనారాయణ, గౌతమి, గరిగంటి సుబ్రహ్మణ్యం, కోళ్ళపూడి సీతారామాంజనేయప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

శాకంబరిదేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు



శాకంబరిదేవి అలంకరణతో అమ్మవారు

బాపట్ల, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని భీమావారిపాలెంలో ఉన్న శ్రీ కోదండరామాలయంలో అమ్మవారు శుక్రవారం శాకంబరిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకొని సారె సమర్పించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అదేవిధంగా జీబీసీ రోడ్డులో ఉన్న బాపట్ల గ్రామదేవత శ్రీపోలేరమ్మతల్లి దేవాలయానికి ఆషాడంసారె తీసుకెళ్ళారు. భక్తులు పెద్ద ఎత్తున ఆయా కార్యక్రమాలలో పాల్గొని అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ ఛైర్‌పర్సన్ జిట్టా ప్రమీలారాణి, సరోజనీ పాల్గొన్నారు.

చాతుర్మాస పూజలు

చెరుకుపల్లి, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నడింపల్లిలో ఉన్న రెడంకమ్మ అమ్మవారికి శుక్రవారం ప్రత్యేక అలంకరణ చేసి చాతుర్మాస పూజలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



గుంత పూడ్చరూ...!

బాపట్లలోని జీబీసీ రోడ్డు దగ్గుమల్లివారిపాలెం వద్ద ఏర్పడిన గుంతతో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు స్పందించి గుంత పూడ్చాలని వాహనచోదకులు కోరుతున్నారు. - బాపట్ల (ఆంధ్రజ్యోతి)

లబ్ధిదారులను ఇబ్బంది పెట్టొద్దు

● ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ
● లబ్ధిదారులను పిలిచి విచారిస్తాం....
● ఆరోపణలు రాకుండా సేవలందించండి

బాపట్ల, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : డబ్బులివ్వలేదనే కారణంగా లబ్ధిదారులకు రుణాలివ్వకుండా ఇబ్బంది పెడుతున్నారంటూ మెప్మా సిబ్బందిపై అనేక ఆరోపణలు వస్తున్నాయని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ తెలిపారు. బాపట్ల మున్సిపల్ కౌన్సిల్ హాలులో శుక్రవారం మెప్మా సీఎంఎం నర్రా సుబ్రహ్మణ్యం అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ సిబ్బంది పెట్టే ఇబ్బందులు గురించి అనేకమంది తన కార్యాలయానికి వచ్చి ఫిర్యాదు చేస్తున్నారన్నారు. పొరపాట్లు జరగకుండా చూడాలన్నారు. దీనిపై లబ్ధిదారులను పిలిచి విచారిస్తామని చెప్పారు. ఈవిషయాన్ని సీరియస్‌గా తీసుకొని స్వయం సహాయక సంఘాల సభ్యులకు సేవలందించాలని ఆటంకం పరిస్తే సహించేదిలేదని హెచ్చరించారు. కొంతమంది టీమ్‌లీడర్‌లు సభ్యుల డబ్బులు వసూళ్ళు చేసి బ్యాంక్‌లో జమ చేయకపోవటం వల్ల గొడవలు జరుగుతున్నాయన్నారు. వీటిపై ఆర్పీలు విచారించి అలాంటివి జరగకుండా ఎప్పటికప్పుడు సమీక్షించాలన్నారు. 24వ వార్డులో ఇలాంటి సమస్య రావటంతో చర్యలు తీసుకోవటం జరిగిందన్నారు. తప్పులు జరగకుండా చూడాలని, చేసే వారిని ఖండించాలని, సంఘాలు దెబ్బతినకుండా సమాజంలో ఎదిగేవిధంగా మెప్మాసిబ్బంది బాధ్యతతో వ్యవహరిస్తూ సమర్ధవంతంగా పనిచేయాలని ఎమ్మెల్యే వేగేశన తెలిపారు. సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి, ఎల్‌డీఎం శివకృష్ణ, జిల్లా సమైక్య అధ్యక్షురాలు అక్కల నాగవరలక్ష్మి, సీవోలు నవక్రాంత్, మేరీకుమారి, ఉషారాణి, బండి విజయలక్ష్మి, ఆర్పీలు పాల్గొని వారు చేస్తున్న కార్యక్రమాలు గురించి వివరించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

స్వయం సహాయక సంఘాలకు చేయూతనందించాలి

బాపట్ల, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : స్వయం సహాయక సంఘాల ఆర్థికాభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ తెలిపారు. కలెక్టరేట్‌లోని ఈటీసీ హాలులో శుక్రవారం సాయంత్రం నియోజకవర్గ స్థాయి గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. సమావేశానికి డీఆర్‌డీఏ పీడీ ఎ.శ్రీనివాసరావు అధ్యక్షత వహించగా ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ నియోజకవర్గంలోని బాపట్ల, కర్లపాలెం, పిట్టలవానిపాలెం మండలాలలో ఉన్న డ్వాక్రా మహిళలకు రుణాలు సకాలంలో ఇప్పించి వారు యూనిట్‌లు ఏర్పాటు చేసుకునే విధంగా చూడాలన్నారు. తద్వారా ఆర్థికంగా బలపడి బ్యాంక్‌కు రుణం చెల్లించే విధంగా ఉండాలన్నారు. ప్రధానమంత్రి సూర్యఘర్ పథకం కింద సోలార్ సిస్టమ్ సబ్సిడీపై ఏర్పాటు చేసుకునే విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంలో ప్రతి ఒక్కరు భాగస్వాములుకావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏరియా కోఆర్డినేటర్ సుబ్బారావు, ఎల్‌డీఎం శివకృష్ణ, సీసీలు, వీపీవోలు పాల్గొన్నారు.

రెవెన్యూ శాఖ పనితీరు వేగవంతం కావాలి

● కలెక్టర్ జె.వెంకటమురళి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జె.వెంకటమురళి

బాపట్ల, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూశాఖ నిర్వహించే వివిధ ప్రభుత్వ పథకాల అమలు, పనితీరును వేగవంతం చేయాలని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. అన్నదాత సుఖీభవ, తల్లికివందనం పథకాలకు సంబంధించి ఆధార్ వెరిఫికేషన్ పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈనెల 23వ తేదిలోపు ఆధార్ వెరిఫికేషన్ వెబ్‌ల్యాండ్‌లో మార్పులు, చేర్పులు పూర్తి చేయాలన్నారు. రైతుల వద్ద నుంచి నీటితీరువా వసూళ్ళు చేయుటకు తగు చర్యలు తీసుకోవాలని రెవెన్యూఅధికారులను ఆదేశించారు. పీ4 కార్యక్రమంలో బంగారుకుటుంబాలను, మార్గదర్శికులను నిర్ధారించటంలో స్థితిగతులను క్షుణ్ణంగా పరిశీలించాలని అధికారులకు సూచించారు. సంవత్సర ఆదాయం 50 లక్షల ఉన్న వారిని మార్గదర్శికులు కింద చేర్చుకోవాలని చెప్పారు. ఒక్కొక్క మార్గదర్శికి 10కుటుంబాలు మాత్రమే కేటాయించాలన్నారు. ప్రజాప్రతినిధులను కూడా మార్గదర్శికులుగా చేర్చాలన్నారు. బంగారు కుటుంబం, మార్గదర్శికుల ఎంపిక ఈనెల 25వ తేదిలోపు పూర్తి చేయాలన్నారు. పీ4 కింద ఒకగ్రూపును తయారు చేసి అందులో ఆర్డీవోలు, డీఎల్‌డీవోలు, మున్సిపల్ కమిషనర్‌లు ఉండేవిధంగా చూడాలన్నారు.

● నివేశన స్థలాల కొరకు చేసుకున్న దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలని ఆర్డీవోలకు కలెక్టర్ సూచించారు. చీరాల, బాపట్ల, రేపల్లె రెవెన్యూ డివిజన్‌లో ఆన్‌లైన్ ద్వారా ఇళ్ళ స్థలాల దరఖాస్తులు వచ్చిన విషయంపై ఆర్డీవోలను కలెక్టర్ ఆరా తీశారు. గ్రామాలవారిగా ఇళ్ళస్థలాల కేటాయింపునకు అర్హత, అందుబాటులో ఉన్న స్థలాలు గురించి ఎంతమందికి స్థలం సరిపోతుందనే అనే వివరాలు తెలియజేయాలన్నారు. ప్రభుత్వ భూములలో అనధికార కట్టడాలు నిర్మించిన ఇళ్ళను క్రమబద్ధీకరించటానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. అర్హత మేరకు ఇళ్ళు క్రమబద్ధీకరణ చేయాలన్నారు. ప్రజాసమస్యల పరిష్కారవేదికలో వచ్చే అర్జీలకు సరైన రీతిలో ఎండార్స్‌మెంట్ ఇవ్వాలని అధికారులకు సూచించారు. రోడ్డుప్రమాదంలో గాయపడిన, మరణించిన వారి కుటుంబాలకి నష్టపరిహారం అందజేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. యుద్ధంలో ప్రాణత్యాగం చేసిన సైనికుల కుటుంబాలకు స్థలం కేటాయింపులో చర్యలు వేగవంతం చేయాలని ఆర్డీవోలకు కలెక్టర్ సూచించారు. యుద్ధంలో చనిపోయిన వారి భార్యలకు 300 గజాల స్థలం వారు కోరిన చోట ఇచ్చేందుకు స్థలం సేకరించి వివరాలను ఆగస్టు 10వ తేదీలోగా తెలియజేయాలన్నారు. ఆగస్టు 15న మంత్రి చేతులమీదగా ఆ కుటుంబాలకు స్థలం ఇవ్వటం జరుగుతుందన్నారు. ప్రతిగ్రామంలో శ్మశాన వాటికలకు స్థలాలు కేటాయించాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో డీఆర్‌వో జి.గంగాధర్‌గౌడ్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ కనకరాజు, సీపీవో షాలెంరాజు, ఆర్డీవోలు పి.గ్లోరియా, చంద్రశేఖర్, రామలక్ష్మి, డీఎల్‌డీవోలు తదితరులు పాల్గొన్నారు.

2529 మెట్రిక్‌టన్నుల పొగాకుకు ఆమోదం : కలెక్టర్

జిల్లాలో ఇప్పటి వరకు కొనుగోలు చేసిన 2529.650 మెట్రికట్ టన్నుల బ్లాక్‌బర్లి పొగాకును జిల్లా స్థాయి కమిటీ సమావేశంలో ఆమోదించినట్లు కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. జిల్లా స్థాయి పొగాకు కొనుగోలు కమిటి సమావేశంలో పలు అంశాలను ఆమోదించారు. కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ కొనుగోలు చేసిన పొగాకును గోదాంలలో కొంతవరకు పెట్టటం జరిగిందన్నారు. మిగిలిన పొగాకును వేరొక పెద్దగోదాంకు తరలించి ప్రస్తుతం ఉన్న కొనుగోలు కేంద్రాలలో పొగాకు కొనుగోలు చేసేందుకు తీర్మానించటం జరిగిందన్నారు. బ్లాక్‌బర్లి పొగాకును తరలించటానికి టెండర్ల కొరకు జిల్లా మేనేజర్‌కు ఉత్తర్వులు జారీ చేయటమైనదన్నారు. పొగాకు రైతులకు గ్రేడింగ్ మీద అవగాహన కల్పించాలని జిల్లా వ్యవసాయశాఖాధికారికి సూచనలు చేశారు. కొనుగోలు కేంద్రాలు నిర్వహిస్తున్న ప్రాథమిక పరపతి సంఘాల అకౌంట్‌బిలిటి గురించి డీసీవోను పర్యవేక్షణ కొరకు ఆదేశించామన్నారు. కొనుగోలు చేసిన పొగాకును నిల్వ చేసేందుకు కొత్త గోదాములను అన్వేషించుటకు జిల్లా రెవెన్యూ, డివిజన్ అధికారులకు, జిల్లా మేనేజర్లకు బాధ్యత అప్పగించటమైనదన్నారు. పొగాకు కొనుగోలు కేంద్రాల వద్ద మౌలిక సదుపాయాల కల్పనకు జిల్లా మార్కెటింగ్ అధికారిని ఆదేశించటమైనదన్నారు. రైతుల పొగాకు నాణ్యత, ప్రమాణాల బాధ్యత బయ్యర్లకు, ప్రాజెక్ట్ మేనేజర్‌లకు అప్పగించినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ డీఎం కరుణశ్రీ, జిల్లా వ్యవసాయాధికారి వై.రామకృష్ణ, ఆర్డీవోలు పి.గ్లోరియా, చంద్రశేఖర్, ఏపీ ప్రాజెక్ట్ మేనేజర్ రాజు, ఏపీఎంఎఫ్‌లు పాల్గొన్నారు.

జిల్లావ్యాప్తంగా స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమం : కలెక్టర్

జిల్లా వ్యాప్తంగా శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. జిల్లాలోని అధికారులతో శుక్రవారం ఈవిషయమై కలెక్టర్ టెలీకాన్ఫరెన్స్ ద్వారా పలు ఆదేశాలు జారీ చేశారు. ప్లాస్టిక్ నిషేధంపై బాపట్లలో 2వేలమందితో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్నామన్నారు. ర్యాలీకి 1800 మంది విద్యార్థులు, 200మంది అధికారులు పాల్గొంటారన్నారు. ప్రతి విద్యాసంస్థ నుంచి విద్యార్థులు భాగస్వాములు కావాలన్నారు. సింగిల్‌యూజ్ ప్లాస్టిక్ వస్తువులను నిషేధించిన ప్రభుత్వం నిర్ణయాన్ని ప్రజలు, వ్యాపారస్తులు స్వాగతించాలన్నారు. నిబంధనలు ఉల్లంఘించి ప్లాస్టిక్ వస్తువులు అమ్మితే క్రిమినల్ చర్యలు తప్పవని హెచ్చరించారు. అన్నక్యాంటీన్‌లలో ప్లాస్టిక్ రహిత వస్తువులు వాడాలన్నారు. జిల్లాలోని 4 మున్సిపాలిటీలు, 25 మండలాలలో దీనిని వెంటనే అమలు చేయాలన్నారు. జనపనార, బాదం ఆకులు, గుడ్డసంచుల వాడకాన్ని ప్రోత్సహించాలన్నారు. డ్వాక్రా సంఘాల మహిళల నుంచి ప్లాస్టిక్ రహిత వస్తువుల తయారీకి ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తుందన్నారు.

సబ్ జైలులో ఇషిత్ కార్యక్రమం

బాపట్ల, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో సబ్ జైలులోని ఖైదీలకు శుక్రవారం ఇషిత్ క్యాంపెయిన్ నిర్వహించారు. డిస్ట్రిక్ ఇంటిగ్రేటెడ్ స్ట్రాజి ఫర్ హెచ్‌ఐవీ/ఎయిడ్స్ వారు లెప్రసీ సొసైటీ సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఖైదీలకు అవగాహన కల్పించారు. హెచ్‌ఐవీ, టీబీ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ ఎస్.పాండురంగారెడ్డి, జయప్రద, స్వాములు, గబ్బర్‌సింగ్, హేమలత తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

అమృతలూరు, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : కృష్ణా పశ్చిమ డెల్టా పశ్చిమ తూర్పు ప్రధాన కాల్వలో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్లు ఎస్ఐ రవితేజ శుక్రవారం తెలిపారు. కాల్వలో గుర్తు తెలియని మృతదేహం ఉందని గ్రామ వీఆర్వో నవీన్‌కుమార్ తెలిపినట్లు చెప్పారు. మృతుడు వయసు 60 సంవత్సరాలు ఉంటుందన్నారు. వీఆర్వో ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

అమృతలూరు, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : కుటుంబ సమస్యలతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. మండల కేంద్రం అమృతలూరు ఉత్తర ఎస్సీ కాలనీకి చెందిన పెదపూడి హనుమంతరావు (40) తన ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకున్నాడు. వెంటనే 108కు సమాచారం తెలపగా సిబ్బంది వచ్చి చనిపోయినట్లు చెప్పారు. భార్య కమల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మృతుడుకి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

ద్విచక్ర వాహనాలు ఢీ : వ్యక్తికి గాయాలు

చెరుకుపల్లి, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని జాతీయ రహదారిపై గుళ్ళపల్లిలోని ఆరేపల్లి అడ్డరోడ్డు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. మల్లి అనే వ్యక్తి రాజోలు నుంచి చెరుకుపల్లి వస్తుండగా చెరుకుపల్లి నుంచి భట్టిప్రోలు వెళ్లుతున్న వెంకటేశ్వర్లు, తన వాహనంతో మల్లి ద్విచక్రవాహనాన్ని ఢీకొన్నాడు. ఈ ఘటనలో మల్లి వాహనంపై నుంచి డివైడర్‌పై పడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు 108కు సమాచారం తెలపగా రేపల్లె ఏరియా వైద్యశాలకు తరలించారు.

నేడు వ్యవసాయ విద్యుత్ సరఫరాలో అంతరాయం

భట్టిప్రోలు (కొల్లూరు), జూలై 18 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా వ్యవసాయ రంగానికి అందించే విద్యుత్ సరఫరాలో శనివారం అంతరాయం కలుగుతుందని ఏఈ శాంతకుమారి శుక్రవారం తెలిపారు. శనివారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పెదపాలెం, పెదపులివర్రు, గుత్తావారిపాలెం, జిలుగువారిపాలెం, అక్కివారిపాలెం, గొరికపూడి, ఓలేరు, కన్నెగంటివారిపాలెం, తూర్పుపాలెం, వెంకట్రాజునగర్ గ్రామాల పరిధిలో వ్యవసాయ పంపుసెట్లకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని రైతులు సహకరించాలని కోరారు. గృహ అవసరాలకు వినియోగించే విద్యుత్ యథావిధిగా కొనసాగుతుందని ఏఈ తెలిపారు.

కూలిన 200 సంవత్సరాల నాటి మర్రి చెట్టు

వేమూరు, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : వేమూరులో దాదాపుగా 200 సంవత్సరాల నాటి వటవృక్షం (మర్రిచెట్టు) నేల వాలింది. హిందూ అపరకర్మశాల భవనం పక్కనే ఉన్న అతి పెద్ద మర్రిచెట్టు 200 సంవత్సరాల నాడు నాటిక చెట్టుగా చెప్పుకుంటారు. ఎంతో పెద్దదిగా ఉండి ఊడలతో కమ్ముకుని పెరిగిన చెట్టు శుక్రవారం ఒక్కసారిగా మొదలుతో సహా విరుచుకుపడింది. అపరకర్మశాల శ్లాబు భవనంపై పడటంతో భవనం గోడలు దెబ్బతిన్నాయి. పురాతనమైన పెద్ద మర్రిచెట్టు పడిపోయిందన్న విషయం గ్రామస్తులకు తెలియడంతో అందరూ వచ్చి పడిపోయిన చెట్టును చూసి కథలుగా చెప్పుకుంటున్నారు.

ప్రభుత్వ పథకాలు సద్వినియోగపరుచుకోవాలి

అమృతలూరు, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : ప్రతి మహిళ ప్రభుత్వ పథకాలను వినియోగించుకుని కుటుంబం అభివృద్ధి చెందాలని ఎంపీడీవో మారుతీశేషమాంబ అన్నారు. స్థానిక పెన్షనర్స్ భవనంలో భారతీయ రిజర్వుబ్యాంకు సౌజన్యంతో ల్యాంప్ సంస్థ ఆధ్వర్యంలో బ్యాంకుల ఖాతాదారులకు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ ప్రతి కుటుంబం పొదుపు ద్వారా ఆర్థికంగా ఎదుగుదలకు దోహదపడుతుందన్నారు. ల్యాంప్ సంస్థ డైరెక్టర్ కొండపల్లి సాల్మన్‌పాల్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ క్రమ శిక్షణతో కూడిన బ్యాంకు లావాదేవీలు జరుపుకోవాలని సూచించారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ బ్యాంకు అధికారులు పావని, కోటేశ్వరరావు, ల్యాంప్ సంస్థ రిసోర్స్ పర్సన్ వెంకటేశ్వరరావు, విజయభాస్కర్, సీసీలు నాంచారయ్య, బుల్లిబాబు, శోభారాణి, కొండపల్లి రాంజీ తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ



ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

వేమూరు, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలోని మూడు మండలాల పరిధిలో ముగ్గురు లబ్ధిదారులకు శుక్రవారం ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు అందజేశారు. గుంటూరు క్యాంపు కార్యాలయంలో చుండూరు మండలం యడ్లపల్లి గ్రామానికి చెందిన మహ్మద్ ఇర్ఫాన్‌కు రూ.35 వేలు, కొల్లూరు మండలం దోనేపూడికి చెందిన కాట్రగడ్డ రాజ్యలక్ష్మికి రూ.43,984, భట్టిప్రోలు మండలం ఐలవరంనకు చెందిన కౌతవరపు శివశంకర సాంబశివరావుకు రూ.69 వేల వంద చెక్కులను అందజేశారు. అనారోగ్యంతో ప్రైవేట్ ఆసుపత్రులలో చికిత్స అందుకున్న ఈ ముగ్గురు వ్యక్తులు ముఖ్యమంత్రి సహాయ నిధి కోసం ఎమ్మెల్యేకు దరఖాస్తు చేశారు. స్పందించిన ఎమ్మెల్యే సహాయ నిధి నుంచి ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఎమ్మెల్యే ఆనందబాబుకు తమ కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారం కోసమే వేదిక

● టీడీపీ రాష్ట్ర నాయకుడు జీవీ నాగేశ్వరరావు



అర్జీలను స్వీకరిస్తున్న నాగేశ్వరరావు తదితరులు

రేపల్లె, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : ప్రజల సమస్యలను పరిష్కరించేందుకే ప్రజాఫిర్యాదుల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, నియోజకవర్గంలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ రాష్ట్ర నాయకుడు జీవీ నాగేశ్వరరావు అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో శుక్రవారం ప్రజాఫిర్యాదుల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజల సమస్యల పరిష్కారం కోసమే పనిచేస్తుందని, వారు ఇచ్చిన ఫిర్యాదులన్నీ పరిశీలించి ఎప్పటికప్పుడు పరిష్కరించే విధంగా చర్యలు చేపడుతున్నామన్నారు. మొత్తం 70 ఫిర్యాదులు అందాయని, వాటిల్లో ఎక్కువగా నివేశన స్థలాలు, రేషన్ కార్డులకోసం ప్రజలు దరఖాస్తు చేసుకున్నారన్నారు. వాటన్నింటిని పరిశీలించి సత్వరమే పరిష్కరించే విధంగా చర్యలు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు మేకా రామకృష్ణ, టీడీపీ నాయకులు బొర్రా సూర్యరాజు, కొక్కిలిగడ్డ వెంకటేశ్వరావు, చిప్పల పార్థసారథి, వెనిగళ్ళ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ మోహనరావు

వేమూరు, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : మండల గ్రామాల్లో పంచాయతీ సర్పంచ్‌లు, కార్యదర్శులు, పారిశుధ్య కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించాలని మండల పరిషత్ అధ్యక్షుడు ఎల్లమాటి మోహనరావు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం పారిశుధ్య కార్యక్రమాల నిర్వహణకు కేటాయించిన నిధులను సద్వినియోగపరుచుకుని పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అదేవిధంగా మండల పరిషత్ ద్వారా చేపట్టే కార్యక్రమాలను సమావేశంలో వివరించారు. ఈవోపీఆర్డీ శేఖర్ మాట్లాడుతూ, ప్రభుత్వ ఆదేశానుసారం ప్రతి మూడో శనివారం పారిశుధ్య కార్యక్రమాలపై ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహించడం జరుగుతుందన్నారు. అందులో భాగంగా శనివారం వేమూరు ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్ వద్ద ప్రజా ప్రతినిధులు, డ్వాక్రా మహిళలు, విద్యార్థులకు పారిశుధ్యంపై అవగాహన సదస్సు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అందరూ పాల్గొనాలని తెలిపారు. సమావేశంలో ఎంపీటీసీలు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

సాంస్కృతిక కార్యక్రమాలతో ప్రజల్లో చైతన్యం

నగరం, జూలై18(ఆంధ్రజ్యోతి) : మండలంలో సాంస్కృతిక కార్యక్రమాలను ప్రోత్సహించడం ద్వారానే ప్రజల్లో చైతన్యం జవాబుదారీతనం పెరుగుతుందని డాక్టర్ క్రాప రాహుల్‌కుమార్ అన్నారు. యేలేటిపాలెం శ్రీనీలంపాటి లక్ష్మీ అమ్మవారి కోలాటబృందానికి శుక్రవారం డాక్టర్ క్రాప రాహుల్‌కుమార్ రూ.15 వేల విరాళం గ్రామ తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి ఆకిశెట్టి శ్రీనివాసరావు చేతుల మీదగా అందజేశారు. డాక్టర్ రాహుల్‌కుమార్ మాట్లాడుతూ గ్రామాల్లో అందరూ ఐక్యంగా ఉండాలని, సంప్రదాయాల్లో భాగమైన కోలాటంలో మహిళలు అందరూ భాగస్వామ్యం కావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వెలమవారిపాలెం, యేలేటిపాలెం టీడీపీ నాయకులు నాన్న జయరావు, పరిశా శ్యాంబాబు, మస్తాన్‌వలీ, శంకర్‌బాబు, నాంచారయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

రేపల్లె, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలను కూటమి ప్రభుత్వం తక్షణమే పరిష్కరించి ఆదుకోవాలని మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్యాలయం ఆవరణలో శుక్రవారం ఇంజనీరింగ్ కార్మికులు సమ్మె చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ మణిలాల్, ప్రధాన కార్యదర్శి సీహెచ్ మజుందార్, నాయకులు డి.ప్రభాకరరావు, ఎస్.రవి, కె.రాఘవేంద్రరావు, సుబ్బారావు, గీత, అనూష, ఎన్.కిరణ్, పి.మనోజ్, కె.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రేపు, ఎల్లుండి ఎమ్మెల్యే పర్యటన

వేమూరు, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చంపాడు, బూతుమల్లి గ్రామాల్లో ఆదివారం సాయంత్రం 4 గంటల నుంచి 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. సోమవారం ఉదయం 8.30కు వరహాపురం గ్రామంలో ఇదే కార్యక్రమాన్ని నిర్వ హిస్తారు. ఆయా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు పాల్గొంటారని కార్యాలయ వర్గాలు తెలిపాయి.

పారిశుధ్య పాఠం నేర్చేదెన్నడు?

- విస్తరిస్తున్న పిడుగురాళ్ల పట్టణం
- తగ్గట్లుగా కనిపించని పారిశుధ్య సిబ్బంది
- పారిశుధ్య లోపంతో అనారోగ్య సమస్యలు
- సమీపిస్తున్న వర్షాకాలం
- పూడుకుపోతున్న మురుగు కాల్వలు
- ఆక్రమణల నుంచి కలగని మోక్షం
- చిన్నపాటి వర్షాలకే రోడ్లన్నీ జలమయం


మురుగు కాల్వల్లో పేరుకుపోయిన వ్యర్థాలు


తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో నిలిచిన వర్షపు నీరు

పిడుగురాళ్ల, జూలై 18 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలం సమీపిస్తున్నా.. మున్సిపల్ అధికారులు ముందస్తు పారిశుధ్య చర్యలకు పూనుకున్నట్లు కనిపించడం లేదు. పిడుగురాళ్ల పట్టణంలోని 33 వార్డుల్లో ప్రధాన రహదారిలోని సైడ్ డ్రెయిన్స్‌తో పాటు పలు వార్డుల్లో ఉన్న కాల్వలు చెత్తాచెదారంతో నిండిపోతున్నాయి. ప్రధాన రహదారుల వెంట దుకాణదారులు సైడ్ డ్రెయిన్స్‌ను స్లాబులు, నాపరాళ్లతో మూసివేయడంతో.. పారిశుధ్య కార్మికులు పూడిక తీసేందుకు వీలు పడటం లేదు. అద్దంకి - నార్కెట్‌పల్లి రహదారికి ఒకవైపు ఉన్న ప్రధాన సైడ్ డ్రెయిన్ ఓవర్ బ్రిడ్జి వద్ద నుంచి బస్టాండ్ వరకు ఆక్రమణకు గురైంది దుకాణదారులు పూర్తిగా దీనిని కప్పేశారు. కారంపూడి రోడ్డు, మాయాబజార్, వాసవి నగర్, రైల్వే స్టేషన్ రోడ్డులో సైడ్ డ్రెయిన్స్ అన్నీ ఆక్రమణలకు గురయ్యాయి.


కాల్వపై నాపరాళ్లు పరిచిన దృశ్యం

పారిశుధ్య కార్మికులకు ఇబ్బందే

మురుగు కాల్వల పూడిక తీతకు పిడుగురాళ్ల పురపాలక సంఘంలో కాంట్రాక్ట్ కార్మికులతో కలిపి మొత్తం 111 మంది ఉన్నారు. అందులో సగం మందికి పైగా సెలవులతోనే గడుపుతారు. తాత్కాలిక సిబ్బందిని ఏర్పాటు చేసుకున్నప్పటికీ పట్టణం విస్తరిస్తున్న విధంగా.. పారిశుధ్య కార్మికుల సంఖ్య అందుకు తగ్గట్టు లేకపోవడంతో ఎక్కడికక్కడ పారిశుధ్యం అధ్వానంగా తయారైంది. కొన్ని వార్డుల్లో పారిశుధ్య సిబ్బంది రెండు రోజులకు ఒకసారి పారిశుధ్య పనులు నిర్వహించాల్సి వస్తోంది. మురుగు కాల్వలు ఆక్రమించిన దుకాణదారులకు మున్సిపల్ అధికారులు నోటీసులు ఇస్తున్నప్పటికీ.. వాటిని ఏమాత్రం లెక్క చేయడం లేదు. ఆక్రమణలు తొలగిస్తే వ్యతిరేకత వస్తుందేమోనన్న పాలకవర్గం ఆలోచన వారికి వరంలా మారింది.

గుణపాఠం నేర్చుకోవాలి

గతేడాది ఆగస్టులో పట్టణ సమీపంలోని లెనిన్ నగర్‌లో పారిశుధ్యం సమస్య, నీటి కలుషితం వల్ల ఎంతో మంది అనారోగ్యంపాలయ్యారు. మరికొంత మంది కొన్ని కారణాలతో మృతి చెందడం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం కలిగించింది. అప్పటికప్పుడు అధికారులు స్పందించినప్పటికీ కొంతమంది తీవ్ర అనారోగ్యానికి గురయ్యారు. మున్సిపల్ అధికారులు ఇప్పటికైనా గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని ముందస్తుగా మేల్కొకుంటే.. అలాంటి ఘటనలు పునరావృతమైనా ఆశ్చర్యపోవాల్సిన పనిలేదు. పెరుగుతున్న జనాభా, పట్టణ విస్తీర్ణానికి తగ్గట్టుగా పారిశుధ్య కార్మికుల సంఖ్య పెంచుకోవాల్సిన అవసరం ఉన్నప్పటికీ.. రాష్ట్ర ప్రభుత్వం నుంచి సరైన సూచనలు రాకపోవడంతో మున్సిపల్ అధికారులు ఉన్న కార్మికులతోనే కాలం గడుపుతూ వస్తున్నారు.

అరుదైన డెస్మాయిడ్ ట్యూమర్ తొలగింపు


కేసు వివరాలు వెల్లడిస్తున్న రమణ యశస్వి, జీవన్ స్రవంతి

- శ్రమించిన 11 మంది వైద్యుల బృందం
- మహిళకు కొత్త జీవితం ప్రసాదం

గుంటూరుమెడికల్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): పది లక్షల మందిలో ఇద్దరికో, ముగ్గురికో వచ్చే అరుదైన డెస్మాయిడ్ ట్యూమర్‌తో ఆమె బాధపడుతోంది. కణితిని వెంటనే శస్త్ర చికిత్సతో తొలగించకుంటే క్యాన్సర్ ట్యూమర్‌గా మారే ప్రమాదం ఉంటుంది. అత్యంత ప్రమాదకరమైన ఈ ట్యూమర్‌ను శస్త్రచికిత్స చేసి తొలగించేందుకు ప్రైవేటు వైద్యులు సాహసించ లేదు. చివరి ప్రయత్నంగా బాధితురాలు.. గుంటూరు ప్రభుత్వాస్పత్రికి రాగా, ఆమె పరిస్థితి తెలుసుకొని చలించిన 11 మంది వైద్యుల బృందం అత్యంత నైపుణ్యంతో శస్త్రచికిత్స చేసి కణితిని తొలగించింది. దీంతో ఆమెకు కొత్త జీవితం లభించింది. వివరాల్లోకి వెడితే.. గుంటూరుకు చెందిన జీవన్ స్రవంతి (28) రెండేళ్ల కిందట అంబ్లికల్ హెర్నియాకి ల్యాప్రోస్కోపిక్ సర్జరీ చేయించుకున్నారు. రెండు నెలల తర్వాత పొట్ట మీద కణితి ఏర్పడి క్రమేపి పెరిగి పెద్దది కావడంతో చికిత్స కోసం ఆమె పలు ఆసుపత్రులను సంప్రదించారు. ఇది డెస్మాయిడ్ ట్యూమర్‌గా తెలిసిన ప్రైవేటు వైద్యులు సర్జరీ చేసేందుకు సాహసించ లేదు. చివరకు ఆమె జీజీహెచ్‌లో జనరల్ సర్జరీ ప్రొఫెసర్ డాక్టర్ వై.కిరణ్ కుమార్‌ను సంప్రదించారు. వైద్య పరీక్షల అనంతరం ల్యాప్రోస్కోపిక్ ఆపరేషన్ ద్వారా మెష్ వేసి కణితిని తొలగించారు. ఈ శస్త్ర చికిత్సలో జనరల్ సర్జరీ వైద్య బృందం కిరణ్ కుమార్, అరుణ, గీతిక, అక్షయ్, సత్యదేవ్, రవి, పావని, వెంకట రమణ పాల్గొన్నారు. పోలయ్య, శాంసన్, సంతోష్ తదితర ఎనస్థటిస్ట్‌లు మత్తు వైద్యం అందించారు. ఆపరేషన్ తర్వాత కూడా డెస్మాయిడ్ ట్యూమర్ మరలా వచ్చే గుణం ఉంటుందని, అందువల్ల రోగి తరచూ చెకప్ చేయించుకోవాల్సి ఉంటుందని ఆయన తెలిపారు. అతి క్లిష్టమైన శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించిన జనరల్ సర్జరీ వైద్య బృందాన్ని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమణయ శస్వి అభినందించారు.

రక్తం అందిస్తేనే.. ప్రసవం


, సత్తెనపల్లి ఏరియా వైద్యశాలలో పరీక్షలకు వచ్చిన గర్భిణులు

- ప్రతి ముగ్గురు గర్భిణుల్లో ఒకరికి రక్తహీనత
- పౌష్టికాహారం తీసుకోక బలహీనం
- సత్తెనపల్లి డివిజన్‌లో ఆందోళనకరంగా పరిస్థితి


పరీక్షిస్తున్న గైనకాలజిస్టు బి.అరుణ

సత్తెనపల్లి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఇంటికి దీపం ఇల్లాలు. ఆమె ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం బాగుంటుంది. కానీ, సత్తెనపల్లి సబ్ డివిజన్ పరిధిలోని సత్తెనపల్లి, ముప్పాళ్ళ, రాజుపాలెం, బెల్లంకొండ, క్రోసూరు, అచ్చంపేట, పెదకూరపాడు మండలాలకు చెందిన పలువురు మహిళల్లో అది కూడా గర్భిణుల్లో చాలా మంది రక్త హీనతతో బాధ పడుతుండటం ఆందోళన కలిగించే విషయం. సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు ఆయా మండలాల నుంచి గర్భిణులు, మహిళలు, బాలింతలు, బాలికలు చికిత్స నిమిత్తం వస్తుంటారు. వైద్యశాలలో గర్భిణులకు చికిత్స అందించే సమయంలో చాలా మందికి రక్తం ఎక్కించాల్సి వస్తోంది. గర్భిణులకు అంగన్ వాడీ కేంద్రాల్లో బాల సంజీవని పేరుతో కిట్లను పంపిణీ చేస్తున్నారు. నెలలో 25 కోడి గుడ్లు, ఐదు లీటర్ల పాలు, మూడు కేజీల విటమిన్‌లతో కూడిన బియ్యం అందిస్తున్నారు. కానీ, ఆశించిన స్థాయిలో ప్రయోజనం కన్పించడం లేదు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పోషకాహారాన్ని చాలా మంది గర్భిణులు తీసుకోవడం లేదు. ఈ విషయంలో నిర్లక్ష్యం చూపుతున్నారని స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారులు, వైద్యులు చెబుతున్నారు.

2024 ఏప్రిల్ నుంచి ఈ ఏడాది మార్చి వరకు 7,128 మంది గర్భిణులకు పరీక్షలు నిర్వహిస్తే.. 2,761 మంది రక్త హీనతతో బాధ పడుతున్నట్లు వైద్యులు గుర్తించారు.

ఎన్నెన్నో సమస్యలు

రక్త హీనత బారిన పడిన మహిళల్లో చురుకుదనం లోపిస్తుంది. మెదడు, వెన్నెముక సమస్యలు వస్తాయి. తల్లి బలంగా ఉంటేనే శిశువు సైతం ఆరోగ్యంగా ఉంటుంది. రక్త హీనత బారిన పడిన గర్భిణుల శిశువుల్లో ఎదుగుదల ఉండదు. ప్రసవం జరిగాక కొన్ని రోజులు ఆస్పత్రిలోనే ఉండాల్సి వస్తోంది. అందుకే గర్భిణులు మంచి పోషకాహారం తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

సమతుల ఆహారం తప్పనిసరి

మహిళలు సమతుల ఆహారం తీసుకోవాలి. గర్భిణులు ఆకు కూరలు, పప్పు తప్పనిసరిగా ఉండేలా చూసుకోవాలి. రాగి జావలో బెల్లం కలుపుకొని తాగాలి. గర్భిణులు బాగా తింటేనే బిడ్డ ఎదుగుదల ఉంటుంది. తల్లిబిడ్డ ఆరోగ్యంగా ఉంటారు.

- డాక్టర్ బంకా అరుణ, గైనకాలజిస్టు

ఐరన్ మాత్రలు, ఇంజక్షన్‌లు అందిస్తున్నాం



వైద్యశాలకు వచ్చే గర్భిణుల్లో రక్త హీనతతో బాధ పడే వారిని గుర్తించి ఐరన్ మాత్రలు, ఐరన్ శుక్రోజ్ ఇంజక్షన్‌లు అందిస్తున్నాం. రక్త శాతం పెరిగేందుకు కృషి చేస్తున్నాం. డెలివరి సమయంలో రక్తం కూడా అందిస్తున్నాం.

- డాక్టర్ లక్ష్మణరావు, సూపరింటెండెంట్,
సత్తెనపల్లి ఏరియా వైద్యశాల

నిఘా నేత్రాలతో నేరస్థుల ఆటకట్టు


వృద్ధురాలు రాజేశ్వరి మృతదేహం(ఫైల్)


ఓ అపార్ట్‌మెంటులోని సీసీ కెమెరా

తెనాలి మారీసు పేట జూలై18, (ఆంధ్రజ్యోతి): పెరిగిన సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో పలు కీలక మైన కేసుల్లో నేరస్థులను గుర్తించేందుకు నిఘా నేత్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. సీసీ కెమెరాల వ్యవస్థ ప్రయోజనాలను గుర్తించిన పోలీసులు గృహాలు, వ్యాపార సముదాయాలకు అమర్చుకోవాలని అవగాహన కల్పిస్తున్నారు. దీంతో చాలా వరకు నేర నియంత్రణ జరిగనప్పటికి.. అక్కడక్కడ కేసులనూ ఫుటేజీల సాయంతో ఛేదిస్తున్నారు. తెనాలి పట్టణంలో ముత్తెశెట్టిపాలెం కబేళా వంతన సమీపంలో చిన్న టిఫిన్ కొట్టు నిర్వహించుకునే ఒంటరి వృద్ధురాలిని నగల కోసం ఇంటి పక్కనే ఉంటున్న యువకులు పక్కా ప్రణాళికతో హత్య చేశారు. గొంతు నులిమి ప్రాణం తీసి ఆమె ఇంట్లోనే మంచంపై పడుకోబెట్టి నగలు దొంగిలించారు. పోలీసులు కేసు విచారణలో.. సమీపంలోని సీసీ కెమెరాలను పరిశీలించగా యువకులు చేసిన ఘాతకం బట్టబయలైంది.

● అదే విధంగా మారీసుపేటలో నివసించే మరో వృద్ధురాలు ధరించిన బంగారంపై పరిసర ప్రాంతంలో ఉండేవారి కన్నుపడింది. ఒంటరిగా ఉన్న వృద్ధురాలి ప్రాణం తీసి సహజ మరణంగా చిత్రీకరించి నగలు అపహరించుకుపోయారు. దీనిపై కుటుంబ సభ్యులు సైతం సహజ మరణంగా తొలుత భావించిన, నగలు కనిపించక పోవడంతో.. పోలీసులను ఆశ్రయించారు. అలాగే పరిమి డొంక రోడ్డులో అప్పడాల కంపెనీ నిర్వాహకురాలు తన ఇంటిలో వియ్యపురాలితో కలసి నివాసముంటోంది. ఒకరికి ఒకరు తోడు నిలిచి జీవనం సాగిస్తున్నారు. ఇదే అదునుగా పట్టపగలే వారి ఇంటిలోకి ప్రవేశించి అద్దెకు షాపు విషయం మాట్లాడదామంటూ ఇంట్లోకి ప్రవేశించి వృద్ధురాళ్లను హత్య చేశారు. పై రెండు కేసుల్లో సీసీ కెమెరాలు నిందుతులను పట్టించగా మధ్య కేసులో కెమెరాలు లేకపోవడంతో అనుమానస్పద మృతిగానే మిగిలింది. ఒంటిరిగా ఉండే వృద్ధుల కుటుంబ సభ్యులు సీసీ కెమెరా ఆవస్యకతను గుర్తించి ఏర్పాటు చేసుకుంటే అగంతకులు అనుమానస్పద వ్యక్తులు ఇంటి ముందుకు రాగానే గుర్తించి చోరీలకు పాల్పడక ముందే వారిపై చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని పలువురు చెప్తున్నారు. పలు మిస్టరీ కేసులు కూడా నిందితులను గుర్తించడంలో సీసీ కెమెరాల సహకారం ఎంతో ఉంది.

ఏర్పాటు చేసుకోవాలి: సీఐ రమేష్ బాబు

పెరుగుతున్న నేరాలను అదుపు చేసేందుకు సీసీ కెమెరాలు ఎంతగానో దోహదపడుతున్నాయని త్రీటౌన్ సీఐ ఎస్ రమేష్‌బాబు అన్నారు. ఒంటరి వృద్ధులు, మహిళలు నివసించే ఇళ్లకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. పట్టణంలో జరిగిన పలు నేరాల్లో సీసీ కెమెరాల ద్వారా నేరగాళ్లను పట్టుకున్నామని చెప్పారు.

ఈ రోడ్డుకు మోక్షం లేదా?

- రోడ్డు అభివృద్ధికి వైసీపీ ప్రభుత్వంలో రూ.22 కోట్లు మంజూరు
- బిల్లులు రావన్న భయంతో కాంట్రాక్టర్ పరార్
- టెండర్ రద్దుతో అధ్వానంగా రోడ్డు
- నాలుగేళ్లుగా అవస్థల నడుమ ప్రయాణం




కాలువను తలపిస్తున్న తెనాలి - నేలపాడు రోడ్డు

తెనాలిరూరల్, జూలై 18(ఆంధ్రజ్యోతి): తెనాలి పట్టణం నుంచి కొల్లిపర మండలానికి నేలపాడు గ్రామీణ ప్రాంతం మీదుగా వెళ్లే రోడ్డు అధ్వానంగా తయారైంది. రోడ్డుకు వేసిన మెటల్ విడిపోయి తారు, గులకరాళ్లు సైతం రోడ్డు చివరలకు చేరి గుంతలమయంగా మారింది. దాదాపుగా 7కిలోమీటర్ల రోడ్డు గత వైసీపీ ప్రభుత్వంలో అభివృద్ధి చేసేందుకు టెండర్ ప్రక్రియను చేపట్టి.. కాంట్రాక్టర్‌కు రూ.22 కోట్లకు అప్పగించారు. నాలుగేళ్లు గడుస్తున్నా ఈ రోడ్డుకు మాత్రం మోక్షం కలగడం లేదు. గత ప్రభుత్వంలో రోడ్డు పనులు చేపట్టినప్పటికీ బిల్లులు రావన్న భయం కాంట్రాక్టర్‌ను వెంటాడటంతో పనులు నిలిచిపోయాయి. టెండర్ సమయం దాటుతున్నా పనులు చేపట్టకపోవడంతో మంజూరైన నిధులు వెన్నక్కి పోగా కాంట్రాక్ట్ సైతం రద్దయింది. దీంతో రోజులు గడుస్తున్న కోద్ది దాని రూపురేఖలు మారిపోయాయి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాల కారణంగా రోడ్డు కాస్త కాలువ మాదిరిగా నీళ్లు నిలిచి దర్శనమిస్తోంది. ఈ రోడ్డుపై వెళ్లాలంటే వాహనదారులు సాహసం చేయాల్సి ఇక ఇదే మార్గంలో.. జగనన్న కాలనీలు సిరిపురం లేఅవుట్‌లు కూడా ఉన్నాయి. దాదాపుగా ఐదు వేల కుటుంబాలు నివసించేందుకు స్థలాలను అప్పటి ప్రభుత్వం మంజూరు చేసింది. అర్బన్ హెల్త్ సెంటర్‌ను సమీపంలోనే ఏర్పాటు చేసింది. రోడ్డు సరిగా లేకపోవడంతో.. సిరిపురం లే అవుట్‌లో స్థలాలు పొందిన లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణానికి ముందుకు రావడంలేదు. తెనాలి ఐతానగర్ నుంచి నేలపాటు, సిరిపురం మీదుగా కొల్లిపర మండలానికి వెళ్లే వారు గతంలో తక్కువ దూరంతో ప్రయాణించవచ్చని ఈ మార్గాన్ని ఎంచుకునే వారు. పొలాలకు రైతులు సైతం ఈ మార్గంలోనే వెళ్లి రావాల్సి ఉంది. ప్రజలందరికి ఉపయోగపడే ఇటువంటి రోడ్డుపై అటు వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేయగా కూటమి ప్రభుత్వం దృష్టిపెట్టాల్సి ఉంది.

ఆనందం వెద జల్లుతున్నారు


జమ్ములపాలెం గ్రామంలోని పొలాలలో వెదపెడుతున్న దృశ్యం

బాపట్ల, జూలై 18 (ఆంధ్రజ్యోతి): బాపట్ల నియోజకవర్గ రైతులు ఆనందం 'వెద'జల్లుతున్నారు. సముద్ర తీర ప్రాంత గ్రామాలకు సాగు నీరు అందించే పీటీ చానల్‌కు 120 నుంచి 150 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. తిమ్మరాజు కాల్వ ద్వారా సాగునీరు సరఫరా కావటంతో ఆయకట్టు రైతులంతా ఉత్సాహంగా వెద పెడుతున్నారు. బాపట్ల, కర్లపాలెం, పిట్టలవానిపాలెం మండలాల్లో ఈ ఏడాది రైతులు వెద సాగు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. వరి నారు పెంచి.. నాట్లు వేస్తే సాగు ఆలస్యమవుతుందని భావించి ముందస్తుగానే వెదపెడుతున్నారు. అప్పికట్ల, చుండూరు పల్లి పరిసర ప్రాంతాల్లో ఇప్పటికే వెద పెట్టిన పొలాలు పచ్చని పైరుతో కళకళలాడుతున్నాయి. సముద్ర తీర ప్రాంతంలోని ఇసుక భూముల్లో కూడా వెద పెట్టారు. వర్షాభావ పరిస్థితులు ఏర్పడినప్పటికీ.. సాగు నీటికి ఎలాంటి ఇబ్బందులుండవని ఇరిగేషన్ అధికారులు భరోసానివ్వడంతో రైతులు ఉత్సాహంగా సాగు ప్రారంభించారు. కొంతమంది వరినారు పెంచుతున్నారు.


పీటీ చానల్‌లో ప్రవహిస్తున్న సాగునీరు


వెద పద్ధతి వరి చేనులో నిలిచిన వర్షపు నీరు

వెద పైరుకు.. వర్షపు జల్లు ఊపిరి

కొల్లూరు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): వెద సాగు వరికి వరుణుడు జీవం పోశాడు. గురువారం సాయంత్రం, శుక్రవారం ఉదయం పడిన వర్షానికి.. పంటలు జీవం పోసుకుని కళకళలాడుతున్నాయి. ఈ వర్షాలతో మరో వారం రోజులు వరి పంటకు, నారుమళ్లకు నీటి తడులు అందించాల్సిన అవసరం లేదని, మళ్లీ అడపా దడపా వర్షాలు కురిస్తే పంటకు సాగునీరు అంది కళకళలాడతాయని రైతులు చెబుతున్నారు. వర్షాభావ పరిస్థితులతో ఖరీఫ్ ప్రారంభం నుంచి రైతులు ఇబ్బందులు పడ్డారు. కొల్లూరు, భట్టిప్రోలు మండలాల పరిధి లోని మాగాణి భూముల్లో ఎక్కువ శాతం వెద పద్ధతిలో వరి సాగు చేశారు. మరికొందరు నారుమళ్లు పోశారు. జూలై నెల ప్రారంభం నుంచి వర్షపు జాడలు లేకపోవడంతో రైతులు వరి పంటకు, నారుమళ్లకు సాగునీరు అందించేందుకు బోర్లపై ఆధారపడ్డారు. ఇటీవల కాల్వలకు సాగు నీరు విడుదల అయినప్పటికీ పొలాలకు అందకపోవడంతో.. ఆయిల్ ఇంజన్లతో పంటకు తడులు అందించారు. విపరీతమైన వడగాలులు వీయడంతో రైతుల కష్టం కొరగాకుండా పోయింది. దీంతో వెద్ద పద్ధతి వరి పంట, నారుమళ్లు సాగునీరు అందకపోవడంతో జీవం కోల్పోతున్నాయి. పైగా సాగు నీటి తడుల కోసం రైతులపై అదనపు వ్యయ భారం పడింది. ఈ క్రమంలో పడిన వర్షాలు రైతులకు కొంత ఊరటనిచ్చినట్లైంది.

అవీ..ఇవీ..

ప్లాస్టిక్ సంచుల వినియోగంపై నిషేధం

అద్దంకి, జూలై18(ఆంధ్రజ్యోతి): పట్టణంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్ల వినియోగించకుండా చర్యలు చేపడుతున్నట్లు మున్సిపల్ కమిషనర్ రవీంద్ర తెలిపారు. పట్టణంలో ప్రతి రోజు 10 నుండి 20 కిలోల సింగిల్ యూజ్ ప్లాస్టిక్ చెత్త వస్తున్నట్లు గుర్తించామన్నారు. పారిశుధ్య కార్యదర్శులతో వీటి వినియోగంతో వచ్చే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. వీటిని వినియోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అమ్మకాలు చేసే దుకాణాలపై కూడా చర్యలు తీసుకుంటామన్నారు. క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రత్యామ్నాయంగా చేలి సంచులను వినియోగించాలన్నారు. మెప్మా సభ్యుల ఆధ్వర్యంలో తయారు చేసేందుకు మున్సిపాలిటీ తరపున ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు.

సచివాలయాల్లో సేవలపై ప్రత్యేక దృష్టి

● మున్సిపల్ చైర్మన్ మించాల సాంబశివరావు



వార్డు సచివాలయాన్ని పరిశీలిస్తున్న చైర్మన్

చీరాల, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : పురపాలక సంఘం పరిధిలోని అన్ని సచివాలయాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ మించాల సాంబశివరావు పేర్కొన్నారు. గురువారం నూతనంగా బాధ్యతలు చేపట్టిన చైర్మన్ తొలిసారిగా 27వ వార్డు సచివాలయాన్ని కమిషనర్ అబ్దుల్ రషీద్‌తో కలిసి పరిశీలించారు. ఆ సచివాలయంపై ఇప్పటికే పలుమార్లు ప్రజలు ఫిర్యాదులు చేస్తున్నట్లు వివరించారు. సిబ్బంది ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలని సూచించారు. చైర్మన్ వెంట కార్యాలయం సిబ్బంది ఉన్నారు.

ప్రతి నెలా సమావేశాలు నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీపీఎం రవీంద్ర

బల్లికురవ, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : పొదుపు సంఘాల సభ్యులతో ప్రతి నెల గ్రామాలలో సమావేశాలు ఏర్పాటు చేసి వారికి రుణాలపై అవగాహన కల్పించాలని డీపీఎం రవీంద్ర పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక వెలుగు కార్యలయంలో మండలంలోని అన్ని గ్రామాల పొదుపు సంఘాల బాధ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఒక్కో గ్రుపులో ఉన్న సభ్యులకు గొర్రెలు మేకలు, గేదెలు, కోళ్ళు, కిరాణా, టైలరింగ్ వంటి యూనిట్లు ఏర్పాటు చేసుకోనేలా వారికి అవగాహన కల్పించాలన్నారు. అలానే పీఎంజీపీ, పీఎంఈ రుణాలకు లబ్ధిదారులను గుర్తించి బ్యాంకులకు పంపించాలన్నారు. మొబైల్ బుక్ కీపింగ్ ప్రతి నెల 15వ తేదీలోపు పూర్తి చేయాలన్నారు. సమావేశంలో ఎఫ్‌పీవో ఏపీఎం రవి, స్త్రీనిధి మేనేజర్ శ్రీనివాసరావు, మండల సమాఖ్య అధ్యక్షురాలు రమాదేవి ఏపీఎం రాజారావు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ బలోపేతానికి శ్రమించండి

● నియోజకవర్గ ఇన్‌చార్జ్ కరణం వెంకటేష్



క్యూ ఆర్ కోడ్‌ను ప్రదర్శిస్తున్న కరణం వెంకటేష్, వైసీపీ నేతలు

చీరాల, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో వైసీపీ బలోపేతానికి ప్రతి కార్యకర్త శక్తివంచన లేకుండా శ్రమించాలని వైసీపీ ఇన్‌చార్జ్ కరణం వెంకటేష్ పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని ఈపూరుపాలెం నేతాజీ యూనియన్ కల్యాణ మండపంలో విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజా సంక్షేమాభివృద్ధిలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ఈక్రమంలో కార్యకర్తలు వైసీపీ హయాంలో జరిగిన అభివృద్ధిని వివరించాలన్నారు. అనంతరం పేరాల గోలిసదాశివ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన 'బాబు షూరిటీ - మోసం గ్యారంటీ' కార్యక్రమాన్ని నిర్వహించారు. క్యూ ఆర్ కోడ్‌ను ప్రదర్శించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పొగాకు రైతులు నిబంధనలు పాటించాలి

● ఆర్‌ఎం రామారావు



రైతులతో మాట్లాడుతున్న ఆర్‌ఎం రామారావు

ఒంగోలు(రూరల్), జూలై18(ఆంధ్రజ్యోతి): పొగాకు పంట సాగు చేసే రైతులు బోర్డు నిబంధనలు తప్పక పాటించాలని ఆర్‌ఎం శీలం రామారావు కోరారు. ఒంగోలు పొగాకు వేలం కేంద్రం-2లో శుక్రవారం జరుగుతున్న వేలం ప్రకియను ఆయన పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఈ ఏడాది కొంతమంది రైతులు ఒక బ్యారన్‌కు సాగు చేయాల్సిన పొగాకు పంటను సుమారు నాలుగు బ్యారన్‌లకు సరిపడ స్థాయిలో సాగు చేశారని చెప్పారు. 166 మిలియన్‌ల కిలోల ఉత్పత్తికి రైతులకు అనుమతి ఇస్తే ఏకంగా 240 మిలియన్‌ల కిలోల పొగాకు ఉత్పత్తి చేశారని, దీంతో అమ్మకాల ప్రక్రియలో ఇబ్బందికరమైన పరిస్థితి వచ్చిందన్నారు. దీనికితోడు పెట్టుబడులు కూడా పెరగడంతో రైతుకు వచ్చే ఆదాయాలకు గండి పడిందని పేర్కొన్నారు. అధికంగా పొగాకు పంట సాగు చేయటంతో వ్యాపారులు కొనుగోలు చేసిన ప్పటికీ గోదాముల్లో బేళ్లు స్టాకు చేసుకోవటం కూడా ఇబ్బందిగా మారింద న్నారు. ముఖ్యంగా కౌలు రైతులు అప్రమత్తంగా ఉండాలని, లేకుంటే నష్టాల కు గురికావాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. పొగాకు అంతర్జాతీయ మార్కెట్ పంట అని, ఏ దేశంలో పొగాకు తక్కువ ధరకు వస్తుందో వ్యా పారులు అక్కడే కొంటారని తెలిపారు. ఈ ఏడాది పొగాకు నారుమడులు అవసరం మేరకు మాత్రమే సాగు చేయాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వేలం నిర్వహణాధికారి జె.తులసి, రైతు నాయకులు పెనుబోతు సునీల్, కట్టా హనుమంతరావు, వైవీ.శేషయ్య, రైతులు పాల్గొన్నారు.







చెరువును తలపిస్తున్న కోటపాడు ఉన్నత పాఠశాల ప్రాంగణం, అద్దంకిలోని ఆర్టీసీ బస్టాండ్ ఇన్‌గేట్, తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో నిలిచిన వర్షపు నీరు

ప్రభుత్వ కార్యాలయాలు జలమయం

అద్దంకి,జూలై18(ఆంధ్రజ్యోతి): అద్దంకి ప్రాంతంలో భారీ వర్షం కురిసింది. గురువారం అర్ధరాత్రి దాటిన తరువాత ప్రారంభమైన వర్షం శుక్రవారం ఉదయం వరకు కురిసింది. వర్షాలు పడాల్సిన సమయంలో ఎండ వేడిమితో అల్లాడుతున్న ప్రజలకు ఒకింత ఉపశమనం కలిగింది. అద్దంకిలో 6.26 సెంటీమీటర్ల వర్షపాతం నమోదయ్యింది. అద్దంకి పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్, తహసీల్దార్ కార్యాలయం, ఎంపీడీవో కార్యాలయం తదితర ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో నీటి కుంటలను తలపించేలా వర్షపు నీరు నిలిచింది. అద్దంకి, పర్చూరు నియోజకవర్గాలలో బోరు బావుల కింద సాగు చేసిన మొక్కజొన్నకు ప్రస్తుత వర్షం జీవం పోసినట్లు అయ్యింది. దీంతో రైతులు ఊపిరిపీల్చు కున్నారు. మెట్ట పంటలు సాగుకు రైతులు సన్నద్ధం అవుతున్నారు.

పంగులూరు : మండలంలోని కోటపాడు ఉన్నత పాఠశాల ప్రాంగణం వర్షపు నీరుచేరి చెరువును తలపిస్తోంది. పాఠశాల భవనంతో పాటు ప్రాంగణం రోడ్డుకన్నా పల్లంగా ఉండడంతో వర్షపు నీరు బయటకు పోయే పరిస్థితిలేదు. గతంలో ప్రాథమికోన్నత పాఠశాలగా ఉన్న ఈ పాఠశాల నేడు 185 మంది విద్యార్థులు, 12 మంది ఉపాధ్యాయులతో ఉన్నత పాఠశాలగా రూపుదిద్దుకొంది. 1 నుండి 9వ తరగతి వరకు ఉన్న ఈ పాఠశాలకు సరిపడా తరగతి గదులు లేని పరిస్థితి. వర్షం పడితే ఉపాధ్యాయులు, విద్యార్థులు నీటి మడుగులో అడుగులు వేస్తూ, తరగతి గదిలోకి అడుగుపెట్టాల్సిన పరిస్థితి నెలకొంది. వర్షపు నీరు నిలవకుండా తక్షణ చర్యలు చేపట్టడంతో పాటు తగినన్ని తరగతి గదులు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.



ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో నిలిచిన వర్షపు నీరు

వెంటాడుతున్న పంచాయతీ కార్యదర్శుల కొరత

● పది పంచాయతీలకు ఇన్‌చార్జులే దిక్కు
● పడకేసిన పారిశుధ్యం
● పొంచి ఉన్న అంటువ్యాధుల ముప్పు

బల్లికురవ, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : ప్రతి గ్రామ సచివాలయానికి ఒక పంచాయతీ కార్యదర్శి ఉండాల్సి ఉన్నా, బల్లికురవ మండలంలో మాత్రం పంచాయతీ కార్యదర్శుల కొరత ప్రజలకు తీవ్ర ఇబ్బంది పెడుతుంది. సాధారణ బదిలీలో ఖాళీగా ఉన్న గ్రామాలకు కార్యదర్శులు వస్తారు అని అనుకోంటే ఎవరు రాలేదని, దీంతో ఉన్న కార్యదర్శులకు రెండు మూడు చొప్పున ఇన్‌చార్జులుగా నియమిం చారు. దీంతో కార్యదర్శులు విధులు సక్రమం గా నిర్వహించలేకపోతున్నారు. గ్రామాలలో పారిశుధ్యం పడకేసింది. రోడ్ల వెంబడి వ్యర్థాలు రోజురోజుకు పెరిగి పోతున్నాయి. వచ్చే వర్షాకాలంలో ఇలా అయితే అంటువ్యాధులు ముప్పు పొంచి ఉందని ప్రజలు బెంబేలెత్తి పోతున్నారు. బల్లికురవ మండలంలో 21 గ్రామ పంచాయతీలు ఉండగా పదిమంది కార్యదర్శులు మాత్రమే విధులలో ఉన్నారు. బల్లికురవ, గుంటుపల్లి, వల్లాపల్లి, అంబడిపూడి, వైదన, కొప్పెరపాలెం, ఉప్పుమాగులూరు, మల్లాయ పాలెం, చెన్నుపల్లి, కొప్పెరపాడు గ్రామాలకు పంచాయతీ కార్యదర్శుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. 11 గ్రామాలలో ఉన్న కార్యదర్శులకే మిగిలిన గ్రామాలకు ఇన్‌చార్జులుగా నియ మించారు. దీంతో ఇన్‌చార్జి కార్యదర్శులు సకాలంలో గ్రామాలలో అభివృద్ధి పనులు చేపట్టలేక పోతున్నారు. గ్రామాలలో ఎక్కడ చూసిన పారిశుధ్యం పడక వేసి ఉంది. రోడ్ల వెంబడి వ్యర్థాలు పెద్దఎత్తున ఉన్నాయి. రోడ్ల వెంట వెళుతుంటే వ్యర్థాలతో దుర్వాసన వస్తోందని ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. మండల కేంద్రమైన బల్లికురవకే పంచాయతీ కార్యదర్శి లేక పోవడంతో పారిశుధ్య పనులు చేయడం లేదని ప్రజలు అంటున్నారు. బల్లికురవ నాలుగు రోడ్ల కూడలిలో అయితే వ్యర్థాలను ప్రజలు రోడ్ల మీదే పడవేసి పోతున్నారని అధికారులు ఎవరు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.



ముక్తేశ్వరం సచివాలయం

పంచాయతీ కార్యదర్శులు లేకపోవడంతో గ్రామాలలో ప్రభుత్వం ద్వారా వచ్చే అభివృద్ధి పనులు కుంటుపడుతున్నాయని నీటి పన్నులు, ఇంటి పన్నుల వసూళ్లు కూడా చేయటం లేదని దీంతో పంచాయతీల ఖజానా కాళీగా ఉంటుందని ప్రజలు అంటున్నారు. జిల్లా ఉన్నతాధికారులు వెంటనే స్పందించి ఖాళీగా ఉన్న కార్యదర్శుల పోస్టులను భర్తీ చేయాలని ప్రజలు కోరుతున్నారు.

విద్యుత్ లైన్ల ఏర్పాటు పనుల పరిశీలన



విద్యుత్‌లైన్ల ఏర్పాటు పనులు పరిశీలిస్తున్న ఈఈ మస్తాన్‌రావు

అద్దంకి, జూలై18 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ విద్యుత్ సరఫరాలో అంతరాయం తగ్గించేందుకు, గృహాలకు నాణ్యమైన విద్యుత్ సరఫరాకు వేర్వేరుగా కొత్త విద్యుత్ లైన్లు ఏర్పాటు చేస్తున్నట్లు ఈఈ నల్లూరి మస్తాన్‌రావు అన్నారు. మండలంలోని కుంకుబాడు లో జరుగుతున్న విద్యుత్ పనులను శుక్రవారం ఈఈ మస్తాన్‌రావు పరిశీలించారు. స్థానికులతో మాట్లాడారు. రూరల్ ఏఈ శివప్రసాద్, సర్పంచ్ గాలం శ్రీనివాసరావు, లైన్‌మెన్ బాషా తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల డిమాండ్లు పరిష్కరించాలి



ఒంటి కాలిపై నిలబడి నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

అద్దంకిటౌన్, జూలై 18(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కారించాలని లేనిపక్షంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఐక్యవేదిక తరపున రాష్ట్రవ్యాప్తంగా అన్ని మున్సిపాలిటీలలో పోరాటాల్లో పాల్గొని నిరసన తెలియజేస్తామని ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు జ్యోతి రమేష్‌బాబు అన్నారు. తమ సమస్యలు పరిష్కారించాలని అద్దంకిలోని మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె శుక్రవారానికి 6వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన ధర్నా కార్యక్రమంలో కార్మికులు ఒంటికాలిపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమానికి ఐక్యవేదిక కోశాధికారి చెన్నుపల్లి నాగేశ్వరరావు, సీఐటీయూ నాయకులు తంగిరాల వెంకటేశ్వర్లు తదితరులు మద్దుతు సమ్మెకు మద్దతు తెలియజేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఆదాం, ఇంజనీరింగ్ విభాగం అధ్యక్ష, కార్యదర్శులు వి. జాను, ఉసురుపాటి శామ్యూల్, కె. మారుతి, జి.మార్కు, రాజ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

వరి రైతులకు మూడు నెలలైనా అందని నగదు

కొత్తపల్లి సర్పంచ్ బ్రహ్మారెడ్డి

చినగంజాం, జూలై 18(ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని పలు గ్రామాలకు చెందిన వరిరైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వానికి ఇచ్చి మూడు నెలలు దాటినా ఇప్పటికి వరకు వారి సొమ్ము ఎందుకు జమజేయలేదని కొత్తపాలెం గ్రామ సర్పంచ్ ఆసోది బ్రహ్మారెడ్డి ఏవో ఆర్.చంద్రశేఖర్‌ను ప్రశ్నించారు. ఈ విషయాన్ని ఉన్నాతాధికారుల దృష్టికి తీసుకొని వెళ్లి త్వరలో రైతుల బ్యాంకు ఖాతాలకు జమ అయ్యేట్లు చేస్తామని ఏవో తెలిపారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ కోమట్ల అంకమ్మరెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. కొత్తపాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని మూలగానివారిపాలెం గ్రామంలో శిథిలావస్థకు చేరిన ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ భవనాలను తొలగించాలని కొత్తపల్లి గ్రామ సర్పంచ్ సమావేశం దృష్టికి తెచ్చారు. గ్రామంలోని ప్రైవేటు పాఠశాలల్లో క్వాలిఫైడ్ ఉపాధ్యాయులు లేరని, పంచాయతీ అనుమ తులు లేని ప్రైవేటు పాఠశాలకు ఎలా అనుమతులు ఇచ్చారని కొత్తపాలెం గ్రామ సర్పంచ్ సభ దృష్టికి తెచ్చారు. ప్రాథమిక పాఠశాల భవనాన్ని తొలగిస్తామని, ప్రైవేటు పాఠశాల పరిస్థితులపై జిల్లా కలెక్టర్, డీఈవోలకు ఫిర్యాదు చేస్తామని ఇన్‌చార్జ్ ఎంపీడీవో ఎన్.విజయ, ఎంఈవో అజయ్ బాబులు తెలిపారు. చింతగుంపల్లె గ్రామంలో ఐదారు సంవత్సరాల క్రితం నిర్మించిన అంగన్‌వాడీ భవనం అసాంఘీక కార్యకలాపాలకు నిలయం గా మారిందని ఉపాధ్యక్షులు బాబురావు సభ దృష్టికి తెచ్చారు. ఎంపీపీ మండల పరిషత్ నిధులు మంజూరు చేస్తే భవనానికి సంబంధించిన పనులు పూర్తి చేస్తామని పంచాయతీరాజ్ ఏఈ డి.దాసు తెలిపారు. మోటుపల్లి సచివాలయంలో పనిచేస్తున్న డిజిటల్ అసిస్టెంట్ పంచాయతీ పరిధిలో గృహలబ్దిదారుల వద్ద నుండి సిమెంట్ తక్కువ ధరకు ఇప్పిస్తామని, మీ పిల్లలకు ఉద్యోగాలు ఇప్పిస్తానని పలువురి వద్ద డబ్బులు వసూలు చేస్తున్న ఆయనపై తగు చర్యలు తీసుకోవాలని మోటుపల్లి సర్పంచ్ వడ్లమూడి సాంబశివ రావు అధికారుల దృష్టికి తెచ్చారు. డిజిటల్ అసిస్టెంట్ వద్ద నుండి డబ్బులు రికవరీ చేసి లబ్దిదారులకు అందజేయాలని ఎంపీపీ ఎంపీడీవో, హౌసింగ్ ఏఈ రాజశేఖర్‌లకు సూచించారు. మండల పరిధిలో అన్నదాత సుఖీభవ పథకం లబ్ధిదా రుల జాబితాలోని రైతుల ఆధార్‌కార్డులో తప్పులు సరిచేసుకోవాలి తహసీల్దార్ జె.ప్రభా కరరావు తెలిపారు. పశుసంవర్థక, ఇరిగేషన్, డ్రైనేజీ, అటవీ, ఎక్సైజ్, మత్స్య, ఆర్టీసీ, ఉద్యానవన శాఖల అధికారులు సమావేశానికి గైర్హాజరు కావడం విశేషం. కార్యక్రమంలో పలు శాఖల అధికారులు, ఎంపీటీసీలు, గ్రామ సర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బ్రహ్మారెడ్డి

పోస్టల్‌ను నిర్వీర్యం చేసే విధానాలను రద్దు చేయాలి

● ఒంగోలులో ఉద్యోగుల నిరసన

ఒంగోలు కార్పొరేషన్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): పోస్టల్ వ్యవస్థను నిర్వీర్యం చేస్తూ ఉద్యోగుల భద్రతకు భంగం వాటిల్లే విధానాలను వెంటనే రద్దు చేయాలని ఆ శాఖ ఉద్యోగులు డిమాండ్ చేశారు. ఫెడరేషన్ ఆఫ్ నేషనల్ పోస్టల్ ఆర్గనైజేషన్ (ఎఫ్ఎన్‌పీవో), నేషనల్ యూనియన్ ఆఫ్ పోస్ట్‌మెన్, ఎంటీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం ఒంగోలులోని హెడ్ పోస్టాఫీస్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌యూపీఈ జిల్లా సెక్రటరీ సిద్ధయ్య మాట్లాడుతూ పోస్ట్‌మెన్‌లకు ఈ-బైక్‌లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. డెలివరీ సెంటర్ పేరును పోస్టల్ డెలివరీ సెంటర్‌గా మార్చాలని, వాటిలో హెడ్‌పోస్టాఫీస్‌లలో పనిచేస్తున్న వారిని నియ మించాలని కోరారు. 2010, 2012 ఎస్టాబ్లిష్ మెంట్ నిబంధనల ప్రకారం పోస్ట్‌మ్యాన్‌లకు బీట్‌లు ఏర్పాటు చేయాలని కోరారు. అన్ని డెలి వరీ సెంటర్‌లో కనీస వసతులు కల్పించడంతోపాటు తపాలా శాఖ ద్వారానే మొబైల్ ఫోన్ లు అందించాలని చెప్పారు. ముఖ్యంగా అందరి కీ మెడికల్, యాక్సిడెంటల్ ఇన్సూరెన్స్ కల్పిం చాలని కోరారు. కార్యక్రమంలో సర్కిల్ అసి స్టెంట్ సెక్రటరీ పి.క్రాంతికుమార్, డివిజన్ ప్రె సిడెంట్ ఎస్.రామాంజనేయులు, కోశాధికారి పి.మోహన్‌రావు, నారాయణరెడ్డి, ఆదినారాయణ, లక్ష్మయ్య, బ్రహ్మతేజ, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



దర్నా నిర్వహిస్తున్న పోస్టల్ ఉద్యోగులు

వినూత్న ఆలోచనలతో రండి!

(5వ పేజీ తరువాయి)

స్పష్టం చేశారు. భవిష్యత్తు అంతా గ్రీన్ హైడ్రోజన్‌దేనని, పారిశ్రామిక రంగంలో విప్లవాత్మక మార్పులకు ఇది శ్రీకారం చుట్టనుందన్నారు. సామాన్యులకు అందుబాటులో ఉండేలా దీనిని ప్రజలకు అందుబాటులోకి తేవాలని సీఎం సూచించారు. రాష్ట్రంలో గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తికి ఇప్పటికే కార్యాచరణ సిద్ధమైందని, ఇందులో పారిశ్రామికవేత్తలు భాగస్వాములు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కాకినాడలో గ్రీన్ అమ్మోనియా ఉత్పత్తి కూడా త్వరలోనే ప్రారంభం అవుతుందన్నారు. 160 మెగావాట్ల గ్రీన్ హైడ్రోజన్ విద్యుత్ ఉత్పత్తి లక్ష్యాన్ని ఏపీ నిర్దేశించుకుందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. 3 గిగా వాట్ల సామర్థ్యంతో ఎలక్ట్రో లైజర్ల ద్వారా గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి చేయనున్నట్లు ప్రకటించారు. ఇప్పటికే ఏపీలో సౌర, పవన, పంప్డ్ విద్యుత్ ఉత్పత్తికి అపారమైన వనరులు ఉన్నాయని, గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టుల ఏర్పాటుకు 1000 కిలోమీటర్ల కోస్తా తీరం, నీరు అందుబాటులో ఉందని స్పష్టం చేశారు. వచ్చే ఏడాది నాటికి గ్రీన్ ప్రాజెక్టులు పనిచేసే స్థాయి రావాలని చంద్రబాబు అభిలాషించారు.

రూ.51 వేల కోట్ల ఒప్పందాలు

ఏపీలో గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియా ఉత్పత్తి చేసేందుకు రెండు సంస్థలు ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో సదస్సు వేదికగా ట్రాన్స్‌ఫర్మేటివ్ అవగాహనా ఒప్పందాలను కుదుర్చుకున్నాయి. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం, సంస్థల ప్రతినిధులు ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. యూకేకు చెందిన యమ్నా సంస్థ రూ.16 వేల కోట్ల పెట్టుబడితో నెల్లూరు జిల్లా కృష్ణపట్నం వద్ద ఏడాదికి మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో ప్లాట్‌ను ఏర్పాటు చేసేందుకు ఎంఓయూ కుదుర్చుకుంది. అలాగే కేఎస్ఏహెచ్ ఇన్‌ఫ్రా సంస్థ మచిలీపట్నంలో 150 కిలోటన్నుల సామర్థ్యంతో గ్రీన్ హైడ్రోజన్, 600 కిలో టన్నుల గ్రీన్ అమ్మోనియా ఉత్పత్తి సామర్థ్యంతో ప్లాంట్లను ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చింది. ఇందుకు రూ.35 వేల కోట్లను పెట్టుబడి పెట్టనుందని ముఖాముఖి తర్వాత జరిగిన సదస్సులో సీఎం చంద్రబాబు ప్రకటించారు. ముఖాముఖి సదస్సులో నీతి అయోగ్ సభ్యులు డాక్టర్ వీకే సారస్వత్, కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి కె.జయానంద్, ఎస్ఆర్ఎం వర్సిటీ ప్రోచాన్సలర్ డాక్టర్ పి.సత్యనారాయణ, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డి నారాయణరావు, హైడ్రోజన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు డాక్టర్ ఆర్‌కే మల్హోత్రా, నేషనల్ కెమికల్ ల్యాబ్(పూనే) డైరెక్టర్ డాక్టర్ ఆషీస్ లేలే, నెడ్ క్యాప్ రాష్ట్ర అధికారి డాక్టర్ కమలాకర్‌బాబు పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన అవసరం

● ఏపీఎంఐసీ ప్రాజెక్టు అసిస్టెంట్ డైరెక్టర్ జెన్నమ్మ

ఒంగోలు కలెక్టరేట్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): సమాచార హక్కు చట్టం పై పూర్తి స్థాయిలో అవ గాహన పెంచుకోవాలని ఏపీఎంఐసీ ప్రాజెక్టు అసి స్టెంట్ డైరెక్టర్ పి.జెన్నమ్మ సూచించారు. శుక్ర వారం ఒంగోలులోని ఏపీ ఎంఐసీ కార్యాలయంలో సంబంధిత ఉద్యోగులకు సమాచార హక్కు చ ట్టంపై అవగాహన కల్పించారు. ఈ చట్టం కింద దరఖాస్తు వస్తే అందుకు సంబంధించిన సమాచారాన్ని ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఆ యా దరఖాస్తులను పెండింగ్ లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత సంబం ధిత అధికారులపై ఉంటుందన్నారు. అందుకోసం చట్టంపై అవగాహన పెం చుకుని దరఖాస్తుదారునికి సకాలంలో సమాచారం ఇవ్వాలని సూచించారు ఈ కార్యక్రమంలో ఆ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గాంధీ జయంతికి..
'స్వచ్ఛాంధ్ర' బహుమతి!

(5వ పేజీ తరువాయి)

కార్పొరేషన్ ద్వారా పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లోని మునిసిపాలిటీల్లో చెత్త శుద్ధికి రూ.30.35 కోట్లు నిధులు విడుదల చేసింది. టెండర్ ప్రక్రియ ద్వారా మహాత్మా గాంధీ జయంతి అక్టోబరు 2వ తేదీ కల్లా వ్యర్థాలను తొలగించే దిశగా పనులు నిర్వహిస్తున్నారు.

3.63 లక్షల మెట్రిక్ టన్నుల చెత్త శుద్ధి

పల్నాడు జిల్లాలోని నరసరావుపేట, చిలకలూరిపేట, మాచర్ల, పిడుగురాళ్ల, వినుకొండ, దాచేపల్లి, గురజాల, గుంటూరు జిల్లాలోని గుంటూరు కార్పొరేషన్, పొన్నూరు, బాపట్ల జిల్లాలోని రేపల్లె, బాపట్ల కార్పొరేషన్ సహా మొత్తం 11 చోట్ల పనులు జరగుతున్నాయి. 3.63 లక్షల మెట్రిక్ టన్నుల చెత్త శుద్ధి చేయాలని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ లక్ష్యంగా పెట్టుకుంది. కంపోస్టు యార్డుల్లో పేరుకుపోయిన చెత్తను ఎరువుగా మర్చే ప్రక్రియ జరుగుతోంది. ఇందుకు సంబంధించి యార్డుల్లోనే యంత్రాలను ఏర్పాటు చేశారు.

వ్యర్థాల తొలగింపు ఇలా..

రెడ్‌బే టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు చెత్త తొలగింపు పనులను స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ అప్పగించింది. చెత్తలో ఉన్న ప్లాస్టిక్ కవర్లను వేరు చేసి అవసరమైన కంపెనీలకు తరలిస్తారు. వ్యర్థాల్లో వస్త్రాలు, మట్టి, రాళ్లు, ప్లాస్టిక్‌ను యంత్రాల ద్వారా వేరు చేస్తారు. ఇలా వచ్చే మట్టిని మునిసిపాల్టీల్లో లోలెవల్ ప్రాంతాలకు వినియోగించనున్నారు. మొత్తం మీద మునిసిపాలిటీల కంపోస్టు యార్డుల వద్ద రహదారులపై గుట్టలు గుట్టలుగా పేరుకుపోయిన వ్యర్థాలను పూర్తిగా శుభ్ర పరచనున్నారు. వ్యర్థాలను యార్డులకు తరలించే పరిస్థితి లేక.. రహదారుల మార్జిన్‌లలో తగలబెట్టె పరిస్థితి కూడా ఇక ఉండదు. ఇక మీదట తడి పొడి చెత్తను కచ్చితంగా వేరు చేయాలని మునిసిపాలిటీలను స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఆదేశించింది. ఘన వ్యర్థాలను విద్యుత్ ఉత్పతి ప్లాంట్‌లకు తరలించాలని నిర్ణయించారు. ఈ ప్రక్రియ పూర్తి స్థాయిలో అమలు జరిగితే పట్టణాల్లో పరిశుభ్రత నెలకొనే అవకాశం ఉంది.

అవీ..ఇవీ..

రేపు కౌలురైతు సంఘం జిల్లా మహాసభలు

పర్చూరు, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : కారంచేడు మండలం స్వర్ణ గ్రామంలో ఈ నెల 20న కౌలురైతు సంఘం జిల్లా మహాసభలను నిర్వహించనున్నట్లు రైతుసంఘం నాయకులు కొండయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిరంతరం రైతు సమస్యలపై కౌలు రైతుసంఘం విశేష కృషి చేస్తోందన్నారు. అందులో భాగంగా గత సంవత్సరం కొమ్మమూరు కాలువలో నీరు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో అప్పటి ప్రభుత్వ యంత్రాంగాన్ని కదిలించి వారబంధి విధానం ద్వారా నీటిని ఇప్పించిన ఘనత కౌలు రైతు సంఘానికే దక్కుతుందని ఆయన అన్నారు.

పావులూరు సొసైటీ పర్సన్ ఇన్‌చార్జ్‌గా రాంబాబు ప్రమాణస్వీకారం



మాట్లాడుతున్న చైర్మన్ నారిశెట్టి రాంబాబు

ఇంకొల్లు, జూలై 18,(ఆంధ్రజ్యోతి) : ఇంకొల్లు మండలంలోని పావులూరు పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జ్‌గా ఆ గ్రామానికి చెందిన నారిశెట్టి రాంబాబు ప్రమాణస్వీకారం చేశారు. పర్చూరు మార్కెట్ యార్డు చైర్మన్ గుంజి వెంకట్రావు ముఖ్యఅతిథిగా హాజరుకాగా సహకార సంఘ బ్యాంకు అధికారులు విజయలక్ష్మి, సుభాని, వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో చైర్మన్‌గా రాంబాబు, డైరెక్టర్లు కామేపల్లి తాతారావు, గుంజి నాగేశ్వరరావులతో ప్రమాణస్వీకారం చేయించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు నాయుడు హనుమంతరావు, ఇంకొల్లు పీఏసీఎస్ చైర్మన్ కరి శ్రీనివాసరావు, చిలుకూరి శ్రీనివాసరావు, పావులూరు సర్పంచ్ బీలూధియమ్మ, తన్నీరు రామాంజనేయులు, బట్టు శ్రీనివాసరావు, రవి, వెంకటేశ్వరావు, మాధవరావు, పోలయ్య, అన్నెం వెంకట్రావు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

రేపు ఉచిత మెగా వైద్యశిబిరం

పంగులూరు, జూలై 18(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన పంగులూరులో ఈ నెల 20న ఆదివారం ఉపాస్ వైద్యశాల ఒంగోలువారి సహకారంతో ఉచితమెగా వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు సమన్వయకర్త తాళ్లూరి రామాంజనేయులు తెలిపారు. ఈ వైద్యశిబిరంలో సాధారణ, గుండె సంబంధిత వ్యాధులు, ఎముకలు, కీళ్ల సంబంధిత వ్యాధులు, కంటివ్యాధులతో పాటు థైరాయిడ్, ఆయాసం, ఊపిరితిత్తుల వ్యాధులకు సంబంధించి వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు ఉచితంగా అందజేయనున్నట్లు తెలిపారు. పంగులూరు పరిసర గ్రామ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగపరచుకోవాలని రామాంజనేయులు కోరారు.

తరగతి గదుల కోసం స్థలం పరిశీలన



గదుల నిర్మాణం కోసం స్థల పరిశీలన చేస్తున్న అధికారులు

పంగులూరు, జూలై 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్లంవారిపాలెం గ్రామంలో పాఠశాల నూతన గదుల నిర్మాణం కోసం మండల అధికారులు శుక్రవారం స్థలాన్ని పరిశీలించారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న భవనం శిథిలావస్థకు చేరడంతో పాటు, వర్షం పడితే కురుస్తుడటంతో నూతన గదుల నిర్మాణం కోసం స్థలాన్ని ఎంపీడీవో స్వరూపారాణి తెలిపారు. పాఠశాల గదుల దుస్థితి గురించి గ్రామస్థులు, ఉపాధ్యాయులు అధికారులకు వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సింగారావు, ఎంఈవో వీరాంజనేయులు, గ్రామపెద్దలు సుబ్బారెడ్డి, చినాదిరెడ్డి పాల్గొన్నారు.

ఔషధ మొక్కలతో ఆరోగ్యం భద్రం



ఔషద మొక్కలు నాటుతున్న ఎంఈవో 2 శ్రీనివాసరావు

అద్దంకిటౌన్, జూలై 18(ఆంధ్రజ్యోతి): మన పూర్వీకులు ఆరోగ్యాన్ని భద్రంగా ఉంచుకునేందుకు ప్రకృతి సిద్ధమైన ఔషద మొక్కలను నిత్య జీవితంలో భాగంగా చేసుకున్నారని ప్రతి ఒక్కరు ఔషద మొక్కల ప్రాముఖ్యతను తెలుసుకుని సద్వినియోగం చేసుకోవాలని, ఎంఈవో-2 శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం మండలంలోని తిమ్మాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో ఐఈఈఆర్డీ స్వచ్ఛంద సేవాసంస్థ నేషనల్ మెడిసినల్ ప్లాంట్ బోర్డ్ సహకారంతో 2025-26 సంవత్సరానికి పాఠశాలలో ఔషద మొక్కల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణంలో ఎంఈవోతో కలిసి 30 రకాల ఔషద మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఔషద మొక్కల ప్రాధాన్యతను సంస్థ అధ్యక్షుడు బత్తుల కిరణ్ విద్యార్థులకు తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం పి. గంగాధరరావు, సీఆర్పీ రమేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి



పెదగంజాంలో సభ్యత్వాన్ని నమోదు చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

చినగంజాం, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని పలు ఉన్నత పాఠశాలల్లో తరగతి గదుల నిర్మాణాలు అసంపూర్ణంగా ఉన్నాయని, వాటిని పూర్తి చేసేందుకు నిధులు విడుదల చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు కే.శ్రీనివాసరావు, జిల్లా గౌరవ అధ్యక్షులు ఎస్.పాపారావులు ప్రభుత్వాన్ని కోరారు. యూటీఎఫ్ నాయకులు శుక్రవారం పాఠశాలలను సందర్శించి ఉపాధ్యాయుల, పాఠశాలల్లోని సమస్యలను తెలుసుకొన్నారు. యూటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న డీఏలను ప్రకటించాలన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.శ్రీనివాసరావు, షేక్.నాయుబ్‌రసూల్, సీ.హెచ్.వెంకట్, జి.రాంబాబు, సీ.హెచ్.కుమార్, మధు, కే.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలకు శాశ్వత పరిష్కారం

- అద్దంకి పట్టణం లో 15.52 కోట్ల రూపాయలతో విద్యుత్ అభివృద్ధి పనులు
- కొత్తగా రెండు సబ్‌స్టేషన్ల నిర్మాణం, ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు
- కొత్తగా విద్యుత్ తీగల ఏర్పాటు
- మరో మూడు దశాబ్దాల పాటు సమస్యలు లేకుండా చర్యలు

అద్దంకి,జూలై18(ఆంధ్రజ్యోతి): 'తరచూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతోంది. పిల్లలు చదువుకోలేకపోతున్నారు. రాత్రివేళలో పసిపిల్లలు గోలపెడుతున్నారు.' ఈ మాటలు అద్దంకి పట్టణంలో ఇకపై పెద్దగా వినిపించకపోవచ్చు. మరో 30 సంవత్సరాలు ఎలాంటి విద్యుత్ సమస్యలు లేకుండా నూతన సబ్‌స్టేషన్ల ఏర్పాటు, పాత తీగల స్థానంలో కొత్తవాటిని ఏర్పాటు చేయడం వంటివి ప్రభుత్వం చేపడుతోంది. ప్రస్తుతం పనులు చేపడుతున్న దృష్ట్యా కొన్నిసార్లు సరఫరాకు అంతరాయం ఏర్పడుతున్నా, భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు ప్రణాళికా బద్ధంగా ముందుకు పోతున్నారు. ఆ మేరకు అధికారులకు మంత్రి గొట్టిపాటి రవికుమార్ దిశానిర్దేశం చేస్తున్నారు.



ద్వారకానగర్ వద్ద నిర్మాణంలో ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్

పట్టణంలో ఏడాది కాలంలో చేపట్టిన, ప్రస్తుతం కొనసాగుతున్న విద్యుత్‌శాఖ పనులు పరిశీలిస్తే సుమారు రూ.15.52 కోట్లతో వివిధ రకాల పనులు చేపడుతున్నారు. ఇప్పటికే సుమారు రూ.11.23 కోట్లతో ఎన్ఎస్‌పీ కాలనీ, ద్వారకానగర్‌లలో విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్మాణం, నాలుగు సబ్‌స్టేషన్లను అనుసంధానం చేసే విద్యుత్ టవర్ లైన్ల నిర్మాణ పనులు చురుకుగా సాగుతున్నాయి. పలు కాలనీలలో అద్దంకి పట్టణానికి విద్యుత్ సరఫరా జరిగిన తొలినాళ్లలో ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాల ఆధారంగా విద్యుత్ సరఫరా చేస్తుండడంతో తరచూ సరఫరాకు అంతరాయం ఏర్పడుతోంది. ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఈ సమస్య పరిష్కారానికి తొలి ప్రాధాన్యత ఇచ్చారు.ఆయా కాలనీలలో కొత్త విద్యుత్ స్తంభాల ఏర్పాటుతో పాటు కొత్త విద్యుత్ లైన్ల ఏర్పాటు కూడా చేయించారు. ఇప్పటికే వెయ్యికి పైగా దెబ్బతిన్న విద్యుత్ స్తంభాల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేశారు. లో-ఓల్టేజ్ సమస్య నుంచి అధిగమించేందుకు 5 చోట్ల 100 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, 63 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు 5, 25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు 2 అదనంగా ఏర్పాటు చేశారు. ఇక కొత్త విద్యుత్ లైన్ల ఏర్పాటుతో పాటు సింగిల్ ఫేజ్ స్థానంలో 5 వైర్లుతో త్రీ ఫేజ్ లైన్‌లు ఏర్పాటు చేస్తున్నారు. ఇలా పెద్ద ఎత్తున విద్యుత్ శాఖ అభివృద్ధి పనులు చేస్తుండటంతో, కొంత కాలంగా తరచూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతోంది.



అద్దంకి పట్టణంలో ఏర్పాటు చేస్తున్న టవర్లు

అయినప్పటికీ, భవిష్యత్తులో మరో మూడు దశాబ్దాల పాటు ఎలాంటి విద్యుత్ సమస్య లేకుండా పనులు చేపడుతున్నారు. విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది కూడా స్థానికంగా ప్రజలను సమన్వయం చేసుకుంటూ పనులు చేస్తుండటంతో ఆయా ప్రాంతాల ప్రజలు సైతం హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అధ్వానంగా బోడవాడ రోడ్డు

రహదారి నిర్మించిన కొద్దికాలానికే మరమ్మతులు

పర్చూరు, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : ప్రధాన మంత్రి సడక్ యోజన ద్వారా నిర్మించిన రహదారి కొద్దికాలానికే దెబ్బతినడంలో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిర్మాణంలో నాణ్యతలు పాటించకపోవడం వల్లే ఇలాంటి పరిస్థితి ఏర్పడిందని ప్రజలు పేర్కొంటున్నారు. గత వైసీపీ ప్రభుత్వ కాలంలో ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన పథకం కింద పర్చూరు మండలంలోని బోడవాడ - రమణాయపాలెం మధ్య 6 కిలోమీటర్ల మేర రూ.3.20 కోట్లతో మూడేళ్ల క్రితం రోడ్డు నిర్మించారు. గతంలో పర్చూరు నుంచి జిల్లా కేంద్రం బాపట్ల వెళ్లేందుకు వీరన్నపాలెం, పోతుకట్ల, కొమర్నేనివారిపాలెం, రమణాయపాలెం గ్రామాల మీదుగా చెరుకూరు వెళ్లి అక్కడ నుంచి వెళ్లేవారు. పాత చెన్నై రోడ్డు నుంచి బోడవాడ మీదుగా రమణాయపాలెం రహదారి అభివృద్ధి చేయగా నేరుగా చెరుకూరు నుంచి బాపట్ల జిల్లా కేంద్రానికి వెళ్లే అవకాశం ఏర్పడింది. దీంతో దాదాపు 8 కిలోమీటర్ల మేర దూరం దక్కింది. ఇంతటి ఉపయోగకరంగా ఉన్న రహదారిని కోట్లు వెచ్చించి అభివృద్ధి చేసినా నిర్వాహణా లోపం కారణంగా నిర్మించిన కొద్దినెలలకే దెబ్బతినడం అధికారుల పర్యవేక్షణా లోపానికి నిలువుటద్దంగా నిలుస్తోంది. రోడ్డు అధ్వానంగా మారి దెబ్బతిని రాకపోకలకు ఇబ్బంది ఏర్పడుతున్నా సదరు గుత్తేదారు నుండి మరమ్మతులు చేయించడంలో అ శాఖ అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం వర్షాకాలం కూడా ముంచుకొస్తుండడంతో ఈ రోడ్డు మరింతగా దెబ్బతినే పరిస్థితి ఏర్పడు తుందని వాహనదారులు ప్రజలు పేర్కొంటు న్నారు. ఇప్పటికైన సంబంధిత అధికారులు ఈరోడ్డు పరిస్థితిపై దృష్టిసారించి మరమ్మ తులు చేయించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



బోడవాడ - రమణాయపాలెం మధ్య అధ్వానంగా ఉన్న రోడ్డు

ప్రజాదర్బార్‌తో సమస్యలకు చక్కని పరిష్కారం

చీరాల, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : ప్రజా దర్బార్‌తో ప్రజల సమస్యలకు చక్కని పరిష్కారం దొరికే అవకాశం కలుగుతుందని ఎమ్మెల్యే కొండయ్య పేర్కొన్నారు. శుక్రవారం నియోజకవర్గ క్యాంపు కార్యాలయంలో ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి పెన్షన్ల కోసం 45, నివేశన స్థలాలు 165, 10 ఇతర అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అందిన ప్రతి అర్జీ పరిశీలించి ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన ఎమ్మెల్యే

రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను ఎమ్మెల్యే కొండయ్య శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా స్థానిక ఏరియా వైద్యశాల అభివృద్ధికి సంబంధించి పలు అంశాలపై మంత్రితో ఎమ్మెల్యే చర్చించారు. అలాగే ఆస్పత్రికి ఇప్పటికే రూ.23.70 కోట్లు నిధులు మంజూరు చేసి ప్రారంభానికి సిద్ధంగా ఉన్న క్రిటికల్ కేర్ శంకుస్థాపనకు మంత్రిని ఆహ్వానించారు. అలాగే వైద్యశాల మరమ్మత్తులతో పాటు కొన్ని ముఖ్య సమస్యలపై సుదీర్ఘంగా మంత్రితో ఎమ్మెల్యే కొండయ్య మాట్లాడారు.



అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

నల్లబర్లీ పొగాకు కొనుగోళ్లలో వేగం పెంచాలి

రైతుసంఘం రాష్ట్ర మాజీ కార్యదర్శి నాగబోయిన రంగారావు

పంగులూరు, జూలై 18(ఆంధ్రజ్యోతి): నల్లబర్లీ పొగాకు రైతులు కష్టాలను గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం కొనుగోళ్లలో వేగం పెంచాలని, రైతుసంఘం మాజీ రాష్ట్ర కార్యదర్శి నాగబోయిన రంగారావు డిమాండ్ చేశారు. రోజుకు 50 మంది రైతుల నుంచి వెయ్యి బేళ్ల కొనుగోలు చేయాలని, పొగాకు అమ్మిన రైతుల ఖాతాలలో వెంటనే నగదు జమచేయాలని డిమాండ్ చేశారు. ఆ మేరకు రైతు సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాగబోయిన రంగారావు మాట్లాడుతూ పంగులూరు మండలంలో ఐదు వేల ఎకరాలలో నల్లబర్లీ సాగు చేశారన్నారు. లక్షల రూపాయలు పెట్టుబడి పండించిన పొగాకు ప్రస్తుతం మండెల రూపంలో నిల్వ ఉందన్నారు. ప్రభుత్వం మొక్కుబడి గా కాకుండా రైతులకు మేలు చేసే దృక్పథంతో కొనుగోళ్లు చేపట్టాలని కోరారు. రైతుల వద్ద మండలంలో 50 వేల క్వింటాళ్ల పొగాకు ఉండగా, రోజువారీ కొనుగోళ్లు వందల సంఖ్యలో ఉంటున్నాయన్నారు. ఇలా అయితే ఎన్నాళ్లకు కొనుగోళ్లు పూర్తవుతాయని ఆ సంఘం జిల్లా కార్యదర్శి రామారావు ప్రశ్నించారు. మార్కెట్‌యార్డ్‌లోని గోడౌన్లు నేడో రేపో నిండే పరిస్థితి ఉందన్నారు. కొనుగోళ్ల సాంద్రత పెంచకుంటే రైతులు తీవ్రంగా నష్టపోతారన్నారు. ఆ మేరకు తహసీల్దార్ సింగారావుకు వినతిపత్రం అందచేశారు. కార్యక్రమంలో రైతుసంఘం నాయకులు రాయిణి వినోద్‌బాబు, మల్లారెడ్డి, ప్రభాకర్, సురేష్, కృపారావు, సింగారావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న నాగబోయిన రంగారావు

ఉపాధి పనుల తనిఖీకి సహకరించాలి



మాట్లాడుతున్న ఎస్ఆర్పీ తులసినాయక్

బల్లికురవ, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : ఉపాధిహామీ పథకం పనుల సామాజిక తనిఖీకి ప్రజలు, అధికారులు సహకరించాలని ఆడిట్ టీం ఎస్ఆర్పీ తులసి నాయక్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఏవో పాండు రంగస్వామి అధ్యక్షతన సామాజిక తనిఖీ సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆడిట్ అధికారులు మాట్లాడుతు గత ఏడాది ఏప్రిల్ నుంచి ఈ ఏడాది మార్చి వరకు చేపట్టిన 645 పనులకు సంబంధించి ఖర్చు చేసిన రూ.12 కోట్లు నిధులపై గ్రామాలలో తనిఖీలు చేపట్టి కూలీలతో గ్రామ సభలు ఏర్పాటు చేస్తామన్నారు. ప్రజలు కూడా ఎక్కడైన అవకతవకలు జరిగితే వెంటనే తనిఖీ బృందాలకు తెలియజేయాలన్నారు. అవినీతిని వెలికి తీసేందుకు తనిఖీలు చేపడుతున్నామన్నారు. సమావేశంలో పీఆర్ ఏఈ మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి రక్కసిపై కలిసికట్టుగా పోరాడుదాం..



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీఐ నాగభూషణం

చీరాల, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : గంజాయి, తదితర మత్తు పదార్థాలపై కలిసికట్టుగా పోరాడదామని టూటౌన్ సీఐ నాగభూషణం అన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శుక్రవారం స్థానిక వీఆర్ఎస్ వైఆర్ఎన్ కళాశాలలో మత్తుపదార్థాల నియంత్రణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు మత్తుపదార్థాలకు బానిసలు కాకుండా దూరంగా ఉండాలన్నారు. అలాగే రూరల్ సీఐ శేషగిరిరావు ఆధ్వర్యంలో వాడరేవు జడ్పీ హైస్కూల్లో శక్తియాప్, ఈవ్‌టీజింగ్, బాల్యవివాహాలు, గుడ్ టచ్ - బ్యాడ్ టచ్, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్సైలు చంద్రశేఖర్, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

లభించని మృతుని ఆచూకీ

యద్దనపూడి, (మార్టూరు)జూలై18(ఆంధ్రజ్యోతి): జాతీయరహదారిపై యద్దనపూడి మండల పరిధిలో సూరవరపుపల్లి గ్రామ సమీపంలో ఈ నెల 14న సోమవారం రాత్రి పోలీసులు గుర్తి తెలియని మృతదేహాన్ని గుర్తించిన సంగతి తెలసిందే. అయితే ఆ వ్యక్తికి సంబంధించిన సమాచారం లభ్యం కాలేదని శుక్రవారం ఎస్ఐ టి.రత్నకుమారి తెలిపారు. దీంతో మార్టూరు ప్రభుత్వ ఆస్పత్రిలో ఉంచిన ఆయన మృతదేహానికి శనివారం పోస్టుమార్టం పూర్తి చేయనున్నట్లు తెలిపారు.

తెగిన విద్యుత్ తీగలు.. తప్పిన ప్రమాదం



తెగిపడిన విద్యుత్ వైర్లు

ఇంకొల్లు, జూలై 18, (ఆంధ్ర జ్యోతి) : ఇంకొల్లు - కడవకుదురు రోడ్డు లోని ఫౌండ్రీల వద్ద గురువారం రాత్రి విద్యుత్ తీగలు తెగి పడ్డాయి. భారీ గా ఉరుములు, మెరుపులు ఈదురుగాలులతో కూడిన వర్షం కురవడంతో వైర్లు తెగాయి. అధికారు లు వెంటనే స్పందించడంతో ప్రమాదం తప్పింది. వైర్లు తెగిపడడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయి ఆ ప్రాంతంలో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. శుక్రవారం విద్యుత్‌శాఖ అధికారులు పరిశీలించి మరమ్మతులలు చేపట్టారు. గురువారం వేకువజామున కురిసిన వర్షానికి రోడ్లు జలమయమైయ్యాయి.

దివ్యాంగులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



దివ్యాంగులకు ట్రై సైకిళ్లు అందజేస్తున్న మండల విద్యాశాఖాధికారులు

చినగంజాం, జూలై 18(ఆంధ్రజ్యోతి) : దివ్యాంగ విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో-1, 2లు బి.అజయ్‌బాబు, ఎన్.కోటేశ్వరరావులు సూచించారు. స్థానిక మండల విద్యాశాఖ కార్యాలయ ఆవరణలో జిల్లా సమగ్రశిక్ష వారి ఆధ్వర్యంలో ప్రత్యేక అవసరాలున్న పిల్లలకు అందజేసిన వివిధ రకాల ఉపకరణాలను శుక్రవారం పంపిణీ చేశారు. జిల్లా సమగ్ర శిక్ష వారు రూ.57,000ల విలువైన ట్రై సైకిళ్లు, వినికిడి యంత్రాలను అందజేసినట్లు ఎంఈవోలు తెలిపారు. ప్రత్యేక అవసరాలున్న ముగ్గురు విద్యార్థులకు ట్రై సైకిళ్లు, ముగ్గురికి వినికిడి యంత్రాలను పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సహిత విద్యా ఉపాధ్యాయులు టి.బాలకృష్ణ, డి.నాగార్జున, బి.సుబ్బరాజు, సీఆర్పీలు ఎన్.సునీల్, రామకృష్ణారెడ్డి, అశీష్‌కుమార్, ఎంఐఎస్ ఎం.మురళి, డేటా ఆపరేటర్ మురళికృష్ణారెడ్డి, దివ్యాంగుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



చిన్నారిని పరీక్షిస్తున్న వైద్యాధికారి కీర్తి సరోజ్

చినగంజాం, జూలై 18(ఆంధ్రజ్యోతి) : సీజనల్ వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్ట్ జిల్లా సమన్వయకర్త డాక్టర్ ప్రవీణ్ అన్నారు. మండలంలోని కడవకుదురు గ్రామంలో శుక్రవారం నిర్వహిస్తున్న 104 వైద్య శిబిరాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటే వ్యాధులు దరిచేరవన్నారు. 104 వైద్య శిబిరాన్ని అందరూ వినియోగించుకోవాలని సూచించారు. బాలింతలు, గర్భిణులకు మలేరియా, డెంగ్యూ తదితర వ్యాధులపై అవగాహక కల్పించి, తగు సూచనలు, జాగ్రత్తలు అందజేశారు. సంతరావూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కే.కీర్తిసరోజ్ చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు పలు వ్యాధులకు సంబంధించి వారికి వైద్య పరీక్షలు నిర్వహించారు. తదనంతరం మందులు అందజేశారు. కార్యక్రమంలో 104 డి.ఎం. జె.నాగేశ్వరరావు, 104 డీఈవో పొదిలి రాఘవ, ఎంఎల్‌హెచ్‌పీ రమ్య, ఏఎన్ఎం ఎం.శారద, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పీ4పై అవగాహన

యద్దనపూడి,(మార్టూరు)జూలై18(ఆంధ్రజ్యోతి):యద్దనపూడి మండలంలోని అనంతవరం గ్రామ సచివాలయపరిధిలో 105 బంగారు కుటుంబాలును గుర్తించినట్లు ఎంపీడీవో మహమ్మద్ అభీబ్ జావెద్ తెలిపారు. శుక్రవారం మండలంలోని అనంతవరం గ్రామంలో పీ4పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఎంపీడీవో మాట్లాడుతూ అనంతవరం గ్రామ సచివాలయపరిదిలోని అనంతవరం గ్రామంలో 84 కుటుంబాలు, సూరవరపుపల్లి గ్రామంలో 21 కుటుంబాలును బంగారు కుటుంబాలుగా ఎంపిక చేశామన్నారు. అదేవిధంగా 10 మందిని మార్గదర్శకులుగా ఎంపికచేశామన్నారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ టి.కృష్ణ పంచాయతీ కార్యదర్శి డి మోహనబాబు, సూరవరపుపల్లి పంచాయతీ కార్యదర్శి యం తేజశివప్రసాద్, గ్రామ నాయకులు గుదే తారకరామారావు, కొర్రపాటి వంశీకృష్ణ, కోయసతీష్, పోపూరి హనుమంతరావు, పోపూరి సాంబశివరావు, మానకొండ రామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల అందజేత



విద్యార్థులకు నోటు పుస్తకాలు అందజేస్తున్న క్లబ్ ప్రతినిధులు

వాడరేవు (చీరాల), జూలై 18 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని వాడరేవు జిల్లా పరిషత్‌ఉన్నత పాఠశాలలోని 430 మంది విద్యార్థులకు రోటరీక్లబ్ ఆఫ్ చీరాల ప్రతినిధులు రూ.28 వేల విలువైన నోట్‌పుస్తకాలు, పలకలు, పెన్నులు, వివిధ పాఠ్యసామగ్రి అందజేశారు. ఈసందర్భంగా ప్రతినిధులు మాట్లాడుతూ బాల్యం నుంచే లక్ష్యాలపై గురి పెట్టుకోవాలని సూచించారు. తద్వారా ఉన్నత శిఖరాలు అందుకోవచ్చన్నారు. కార్యక్రమంలో పోలుదాసు రామకృష్ణ, కృష్ణమూర్తి, లక్ష్మీ ప్రతాప్, హేమంత్‌కుమార్, మోహన్‌రావు, సురేష్, అప్పారావు, రాఘవరావు, శ్రీనివాసబాబు, డా.బాబురావు, పుల్లయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా సూపర్‌సిక్స్ పథకాలు అమలు

అద్దంకి, జూలై18(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలలో భాగంగా సూపర్ సిక్స్ పథకాలను ప్రణాళికాబద్ధంగా అమలు చేస్తోందని నియోజకవర్గ టీడీపీ సమన్వయం కమిటీ సభ్యుడు చుండూరి మురళీసుధాకర్ అన్నారు. పట్టణంలోని 15వ వార్డులో శు క్రవారం టీడీపీ నేతలు ఇంటింటికి తిరిగి కూటమి ప్రభుత్వం గత ఏడాది కాలంలో అమలు చేసిన సంక్షేమ పథకాలను, భవిష్యత్తులో అమలు చేయనున్న పథకాలను వివరించారు.